Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

Postal regd: GTR/115/2025-27

# రాజధాని వార్తలు

RAJADHANI VARTALU

ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు వార పత్రిక

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 11 సంచిక (Issue) : 54 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 (Andhra Pradesh Capital's First Telugu Weekly)

గురువారం, 14 - 5 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI : APTEL/2015/66622 Postal regd: GTR/115/2025-27 స్థాపితం : 2015

## భారతదేశాన్ని ఏ శక్తీ తల వంచేలా చేయలేదు : ప్రధాని మోదీ



**గాంధీనగర్:** చారిత్రక సోమనాథ్ ఆలయం పునర్నిర్మాణం జరిగి 75 వసంతాలయిన సందర్భంగా గుజరాత్‌లోని గిర్ సోమనాథ్ జిల్లాలో నిర్వహించిన సోమనాథ్ అమృత్ మహోత్సవ్‌లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సోమవారంనాడు పాల్గొన్నారు. 12 జ్యోతిర్లింగాలలో ఒకటైన ప్రఖ్యాత సోమనాథ్ ఆలయాన్ని సర్వాంగసుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానమంత్రి శక్తిమంతమైన సందేశం ఇచ్చారు. పోఖ్రాన్ అణుపరీక్షలను గుర్తు చేస్తూ భారతదేశ దృఢమైన రాజకీయ సంకల్పానికి ఇది ప్రతీక అని చెప్పారు. ప్రపంచంలోని ఏ శక్తీ భారతదేశాన్ని తలవంచేలా కానీ, అణిచి వేయడం కానీ చేయలేదని స్పష్టం చేశారు. 'జాతి ప్రయోజనాలే సుప్రీం. ఎలాంటి ఒత్తిళ్లు మన సంకల్పాన్ని నీరుగార్చలేవు' అని మోదీ పేర్కొన్నారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి నాయకత్వంలో భారతదేశం ఎలాంటి అంతర్జాతీయ ఒత్తిళ్లను కూడా లెక్కచేయలేదని, జాతీయ ప్రయోజనాలకే ఎప్పుడూ తొలి ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు. సోమనాథ్ ఒక ఆలయం మాత్రమే కాదని దేశ దృఢ సంకల్పానికి ప్రతీక అని అభివర్ణించారు. సర్దార్ పటేల్ విజన్‌ను గుర్తు చేశారు. ధ్వంసం నుంచి నవనిర్మాణం వరకూ సోమనాథ్ జర్నీ చెక్కుచెదరని నాగరికతను ప్రతిబింబిస్తుందని చెప్పారు. సోమనాథ్ అమృత్ పర్వ్ కేవలం ఒక పండుగ కాదని, రాబోయే వెయ్యేళ్లు భారతదేశానికి స్ఫూర్తి అని చెప్పారు. సోమనాథ్ ఆలయంలో వేదమంత్రాల మధ్య అభిషేకం, ధ్వజ పూజ, మహా పూజలో ప్రధాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోమనాథ్ ఆలయం వద్ద భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు.

**మెగా రోడ్ షో**

దీనికి ముందు, ప్రధానమంత్రి హెలిప్యాడ్ నుంచి వీర్ హమీర్జీ సర్కిల్ వరకూ రోడ్‌షోలో పాల్గొన్నారు. సుమారు 1.5 కిలోమీటర్ల మేర జరిగిన ఈ రోడ్‌షోలో వేలాది మంది ప్రజలు పాల్గొన్నారు. జెండాలు ఊపుతూ, నినాదాలు చేస్తూ సంప్రదాయ నృత్యాలతో దారిపొడవునా ప్రధానికి సాదర స్వాగతం పలికారు. కాగా, సోమనాథ్ ఆలయ ప్రాభవాన్ని గుర్తు చేస్తూ స్మారక స్టాంపు, నాణేన్ని ఈ ఉత్సవాల్లో ప్రధాని విడుదల చేశారు. గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, ఉపముఖ్యమంత్రి హర్ష్ సంఘ్వి, తదితర నేతలు ప్రధానిని సన్మానించారు.

## మాజీ సీఎం స్టాలిన్‌ను కలిసిన విజయ్.. తమిళ రాజకీయాల్లో కొత్త చర్చ

**చెన్నై:** తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ఓ కొత్త సాంప్రదాయానికి తెర తీశారు. మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ ఇంటికి వెళ్లి ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. కొద్ది నిమిషాల పాటు స్టాలిన్‌తో విజయ్ భేటీ కావడం తమిళనాడులో చర్చనీయాంశంగా మారింది. వీరిద్దరూ ఏమి మాట్లాడుకున్నారనే విషయం బయటకు రాలేదు. గత ఐదేళ్లు తమిళనాడు ముఖ్యమంత్రిగా పని చేసిన స్టాలిన్ తాజా ఎన్నికల్లో ఓటమి చవిచూశారు. ఎన్నికల్లో టీవీకే అత్యధిక స్థానాలు సాధించి అతి పెద్ద పార్టీగా అవతరించింది. అయితే ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన బలం టీవీకేకు దక్కలేదు. దీంతో డీఎంకే మిత్ర పక్షాలైన కాంగ్రెస్, వామపక్షాలు, వీసీకే తదితర పార్టీలు, టీవీకేకు మద్దతు ప్రకటించడంతో విజయ్ సీఎం కాగలిగారు. ఈ నేపథ్యంలో స్టాలిన్‌ను విజయ్ కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇది



మర్యాదపూర్వక భేటీ మాత్రమే అని టీవీకే ప్రతినిధులు వెల్లడించారు. అయితే స్టాలిన్ చొరవతోనే విజయ్‌కు డీఎంకే మిత్రపక్షాలు మద్దతు ప్రకటించాయని వార్తలు వస్తున్నాయి. ఏదేమైనా స్టాలిన్ ఇంటికి విజయ్ వెళ్లడం మాత్రం తమిళనాట హాట్ టాపిక్‌గా మారింది.

## అభివృద్ధిని అడ్డుకుంటే తొక్కి పడేస్తాం : మంత్రి కొల్లు రవీంద్ర

**కృష్ణా జిల్లా, (రాజధాని వార్తలు):** బందరు చరిత్ర తిరగరాసేలా అభివృద్ధి చేసి చూపిస్తామని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. బుధవారం బందరులో తాగునీటి పైపులైన్లు, డీడబ్ల్యూఎమ్ రోడ్డు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. బందరులోని ప్రతి ప్రాంతానికి రోడ్లు, తాగునీటి సౌకర్యాలు అందించేలా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఆరోపణలు, విమర్శలు తప్ప మాజీ మంత్రి పేర్ని నానికి బందరు అభివృద్ధి పట్టదని విమర్శించారు. అభివృద్ధి పనులను అడ్డుకుంటే తొక్కి పడేస్తామని కొల్లు రవీంద్ర వార్నింగ్ ఇచ్చారు. గతంలో రోడ్లను కూడా పట్టించుకోలేదని వైసీపీపై మంత్రి విరుచుకుపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గుంతలు లేని మచిలీపట్నాన్ని సాకారం చేశామన్నారు. తాగునీటి సమస్యల పరిష్కారానికి రూ. 28 లక్షల వ్యయంతో పనులు ప్రారంభించామని తెలిపారు. మచిలీపట్నంలోని అన్ని ప్రాంతాల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. గత ఐదేళ్లు మున్సిపాలిటీ అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. గతంలో ఎంపీగా పని చేసిన కొనకళ్ల నారాయణరావు, ప్రస్తుత ఎంపీ వల్లభనేని బాలశౌరి కృషితో కేంద్రం నుంచి నిధులు వచ్చాయని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా నిధులు సమకూర్చి మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఇళ్ల నిర్మాణ ప్రాంతంలో ఇనుము దొంగిలించేశారంటూ పేర్ని నాని చేసిన వ్యాఖ్యలపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు ఆరోపణలు చేస్తూ.. ఆధారాలు చూపించమంటే తేలుకుట్టిన దొంగల్లా పారిపోతున్నారని మండిపడ్డారు. మార్కెట్ యార్డులో పెట్టిన ఇనుము పాడైపోతుంటే.. దాన్ని వేరే ప్రాంతంలో ఇళ్ల



నిర్మాణం కోసం వినియోగించడంలో తప్పేముందని ప్రశ్నించారు. తప్పు జరిగితే ఫిర్యాదు చేయాలని.. కానీ అధికారులను బెదిరించడం దుర్మార్గమని మండిపడ్డారు. 2014-19 మధ్య పేదల కోసం నిర్మించిన టిడ్కో ఇళ్లను గత ఐదేళ్లు లబ్ధిదారులకు అందకుండా పాడుబెట్టారని మంత్రి ఆరోపించారు. కరగ్రహారం లే అవుట్ పేరుతో వైసీపీ నాయకులు పేదల భూములను తక్కువ ధరకు కొని ప్రభుత్వానికి అధిక ధరకు అమ్మి లాభాలు పొందారని వ్యాఖ్యానించారు. ఇళ్లు కట్టుకోవడానికి కూడా పనికిరాని ప్రాంతాల్లో భూ కేటాయింపుల పేరుతో దోచుకున్నారని ఫైర్ అయ్యారు. ఆ లే అవుట్లలో రోడ్లు, తాగునీటి సౌకర్యాలు ఎందుకు ఏర్పాటు చేయలేదని పేర్ని నాని, జగన్ రెడ్డిని ప్రశ్నించారు. పేర్ని నాని రోజూ మీడియా ముందుకు వచ్చి చెత్త ఆరోపణలు చేయడం తప్ప అభివృద్ధి కోసం ఒక్క ఆలోచన కూడా చేయలేదని మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు.

## ప్రజావసరాలే ప్రభుత్వ ప్రాధాన్యతలు

**- కలెక్టర్లకు దిశా నిర్దేశం చేయనున్న ముఖ్యమంత్రి - గురు, శుక్రవారాల్లో రాష్ట్ర సచివాలయంలో 7వ కలెక్టర్ల కాన్ఫరెన్స్ - బెస్ట్ ప్రాక్టిసెస్‌ను ప్రజెంట్ చేయనున్న పలువురు కలెక్టర్లు, ఎస్పీలు - అభివృద్ధి-సంక్షేమం-గ్రోత్ ఇండికేటర్లపై సమీక్షించనున్న సీఎం**



**అమరావతి, (రాజధాని వార్తలు):** ప్రజావసరాలే ప్రభుత్వ ప్రాధాన్యతలు అనే దిశగా ప్రజా ప్రభుత్వం పని చేస్తోంది. దీన్ని పక్కాగా అమలు చేయడానికి జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు సమావేశమవుతున్నారు. క్రమం తప్పకుండా కలెక్టర్ల కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా సీఎం చంద్రబాబు అధ్యక్షతన గురు, శుక్రవారాల్లో 7వ కలెక్టర్ల కాన్ఫరెన్స్ సమావేశం జరగనుంది. రెండు రోజుల పాటు జరగనున్న ఈ సమావేశాల్లో జిల్లా కలెక్టర్లతో పాటు... వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరుకానున్నారు. ఇటీవల కాలంలో ప్రజాప్రతినిధులతో ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లాల వారీగా సమీక్షా సమావేశాలు నిర్వహించిన క్రమంలో జరుగుతున్న ఈ 7వ కలెక్టర్ల కాన్ఫరెన్స్ ప్రాధాన్యత సంతరించుకుంది. పరిపాలనలో ప్రభుత్వ సమర్ధతను మరింత మెరుగుపరిచేలా దిశానిర్దేశం చేయడం... అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు పురోగతిని సమీక్షించడమే లక్ష్యంగా రెండు రోజుల కలెక్టర్ల కాన్ఫరెన్సును సీఎం చంద్రబాబు నిర్వహించనున్నారు. ఈ రెండు రోజుల సమావేశాల్లో భాగంగా తొలి రోజున స్వర్ణాంధ్ర పది సూత్రాలు, జిల్లాల వారీగా జీఎస్‌డీపీ గ్రోత్, కేంద్ర ప్రాయోజిత పథకాలు, ఫిర్యాదుల పరిష్కారం, పెట్టుబడులు పెట్టిన కంపెనీల గ్రౌండింగ్, ఫైళ్ల క్లియరెన్స్, ఆర్టీజీఎస్ వంటి అంశాలపై సమీక్షించనున్నారు. ఇక పలువురు కలెక్టర్లు తమ తమ జిల్లాల్లో వివిధ అంశాల్లో అవలంభిస్తున్న బెస్ట్ ప్రాక్టీసెస్‌ను...కలెక్టర్ల సదస్సులో ప్రజెంట్ చేస్తున్నారు. ఇలా ప్రజెంట్ చేసిన వాటిల్లో బాగున్నవి...రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని సీఎం ఆదేశిస్తున్నారు. ఈ క్రమంలో 7వ కలెక్టర్ల కాన్ఫరెన్స్ సమావేశంలో నాలుగు జిల్లాలకు చెందిన కలెక్టర్లు... తాము ఆచరించిన బెస్ట్ ప్రాక్టీసెస్‌ను తొలి రోజు ప్రజెంట్ చేయనున్నారు. అలాగే 5, 6 జిల్లా కలెక్టర్ల సమావేశంలో ప్రజెంట్ చేసిన బెస్ట్ ప్రాక్టీసెస్ అమలు ఏ మేరకు వచ్చిందనే అంశంపైనా సీఎం సమీక్షించనున్నారు. ఇక రెండో రోజు సమీక్షా సమావేశంలో సంజీవని, సమ్మర్ యాక్షన్ ప్లాన్, సూపర్ సిక్స్, సంక్షేమం, రెవెన్యూ, ఆదాయార్జన శాఖలు, విద్య, నైపుణ్యాభివృద్ధి, శాంతి భద్రతలపై ముఖ్యమంత్రి సమీక్ష చేస్తారు. రెండవ రోజు భోజన విరామం అనంతరం జిల్లా ఎస్పీలు సమావేశంలో పాల్గొంటారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 06.30 గంటల వరకూ రెండు రోజుల పాటు కలెక్టర్ల సమావేశం జరగనుంది.

## ఉత్తరాంధ్ర ప్రజల కల నెరవేరింది : ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నం నెరవేరిందని, ఈ ఘనత ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు దక్కుతుందని ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్ అన్నారు. విశాఖపట్నం కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు అంశంపై ఆయన స్పందించారు. విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన మీడియా కార్యక్రమంలో ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్ మాట్లాడారు. ఈ రైల్వే జోన్ సాధన కోసం బీజేపీ ఎన్నో పోరాటాలు చేసిందని, విభజన చట్టంలో ఈ అంశంపై స్పష్టత లేనప్పటికీ కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ.. 'రాష్ట్ర విభజన చట్టంలో ప్రత్యేక రైల్వే జోన్ ఇవ్వాలని స్పష్టంగా పేర్కొనలేదు.. కేవలం ఈ అంశాన్ని పరిశీలించాలని మాత్రమే ఉంది. కానీ, 2019 ఎన్నికలకు ముందే ఈ జోన్‌ను ప్రకటించాం.. ఇప్పుడు ఆ కల నెరవేరింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో రైల్వే జోన్ ఏర్పాటుకు అవస రమైన భూమిని అందించడంలో తీవ్ర జాప్యం జరిగింది. ఈ సుదీర్ఘ ప్రక్రియలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రతిష్టాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ జోన్ సాధనలో ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా కీలక పాత్ర పోషించారు. వీరందరికీ కృతజ్ఞతలు. ఒకప్పుడు పీయూష్ గోయల్ మాట్లాడుతూ తెలంగాణ ఇవ్వడం సులువు, కానీ రైల్వే జోన్ ఇవ్వడం కష్టం అని అన్నారు. అమరావతి రాజధానికి ఏ విధంగా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారో, అదే తరహాలో రైల్వే జోన్‌కు కూడా గెజిట్ నోటిఫికేషన్ వచ్చింది. రైల్వే జోన్ విషయంలో ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయి. ప్రభుత్వం మంచి చేసినా వైఎస్సార్సీపీ, వామపక్షాలు గుర్తించడం లేదు. ఈ నెల 10వ తేదీ తర్వాత రాజకీయాల్లో మార్పులు రాబోతున్నాయి. తెలంగాణలో ప్రధాని నరేంద్ర మోదీ ర్యాలీకి సన్నాహాలు చేస్తున్నాం. త్వరలోనే తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వాలు ఏర్పడతాయి' అని అన్నారు.




## మైనారిటీల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉంది : మహ్మద్ నసీర్

**అమరావతి, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో మైనారిటీల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మైనార్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ మహ్మద్ నసీర్ స్పష్టం చేశారు. బుధవారం రాజధాని అమరా వతిలోని ఏపీ అసెంబ్లీలో మైనార్టీస్ సంక్షేమ కమిటీ చైర్మన్ మహ్మద్ నసీర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మహ్మద్ నసీర్ మాట్లాడుతూ.. విద్య, ఆరోగ్యం, ఉపాధి రంగాల్లో మైనారిటీలకు ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. పీఎంజేవీవై కింద రూ.275 కోట్ల నిధుల విడుదల చేసినట్లు చెప్పారు. మైనారిటీల అభివృద్ధికి రూ.1000 కోట్ల డీపీఆర్‌లు సిద్ధం చేశామని పేర్కొన్నారు. గుంటూరు, నంద్యాలలో అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఇమామ్, మౌజన్ల బకాయి గౌరవ వేతనాల విడుదల చేసినట్లు ఆయన వివరించారు. అర్హులైన వారికి కొత్తగా గౌరవ వేతనాల ప్రతిపాదనలు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ప్రార్థనాలయాలకు పొజిషన్ సర్టిఫికెట్స్‌పైనా చర్యలు తీసుకుంటామన్నారు. ముస్లిం మహిళల సాధికారతకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. మైనారిటీలలో స్కిల్ డెవలప్‌మెంట్ కోసం రూ. 20 కోట్ల నిధులు కేటాయించామన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే మైనారిటీ విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తామని చైర్మన్ మహ్మద్ నసీర్ తెలిపారు. మైనారిటీ హాస్టళ్లలో ఖాళీల భర్తీపై చర్యలు తీసుకుంటామన్నారు. బ్యాంకుల ద్వారా రుణాలపై త్వరలో సమీక్ష నిర్వహిస్తామని చెప్పారు.

వ్యవసాయం, విద్య, ఉపాధి రుణాలకు ప్రాధాన్యం ఇవ్వలని ప్రభుత్వాన్ని కోరుతామన్నారు. బీసీ-ఈ దూదేకుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించామని పేర్కొన్నారు. మెగా డీఎస్సీలో ఉర్దూ టీచర్ల నియామకంపైనా చర్చించామని చెప్పారు. అన్ని రంగాల్లో మైనారిటీలకు సమాన భాగస్వామ్యం కల్పించడమే తమ కమిటీ లక్ష్యమని ఆయన వివరించారు. మైనారిటీల అభ్యున్నతికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని మైనారిటీ సంక్షేమ కమిటీ చైర్మన్ నసీర్ వివరించారు.

# మీ దగ్గరకొచ్చే చేనేత వస్త్రాలు కొంటాం

**- సహకార సంఘాలతో మంత్రి సవిత - నాణ్యమైన వస్త్రాలనే ఆప్కోకు విక్రయించండి - ట్రెండ్‌కు తగ్గట్లు వస్త్రాలు నేయండి - నేతన్నల స్కిల్ పెంచేలా శిక్షణిస్తాం - చేనేతల రెట్టింపు ఆదాయమే కూటమి లక్ష్యం - 23 నెలల కాలంలో ఆప్కో ద్వారా రూ.190 కోట్ల వస్త్రాల విక్రయం - రాబోయే మహానాడులో ప్రత్యేక చేనేత స్టాళ్లు ఏర్పాటు - ఆప్కోకు తొలిసారి టీటీడీ ఆర్డర్ - చేనేతల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తాం - త్వరలో నేతన్న భరోసాకు శ్రీకారం : మంత్రి సవిత**









**అమరావతి, (రాజధాని వార్తలు):** నేతన్నలకు రెట్టింపు ఆదాయం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, వారికి ఆర్థిక మేలు కలిగేలా చేనేత సహకార సంఘాల చెంతకు వచ్చి చేనేత వస్త్రాలను కొనుగోలు చేస్తామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. ఇండెంట్‌లో పేర్కొన్న నాణ్యమైన వస్త్రాలనే ఆప్కోకు విక్రయించాలని, ఆ సంస్థను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామని, ఇప్పటికే ఉచిత విద్యుత్ అందజేశామని తెలిపారు. చేనేతల ఆరోగ్య రక్షణకు యూనివర్సల్ హెల్త్ పాలసీని తీసుకొస్తున్నామని, నేతన్న భరోసా పథకం ద్వారా రూ.25 వేల ఆర్థిక సాయం అందించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చేనేత సహకార సంఘాల ప్రతినిధులతో మంత్రి సవిత సోమవారం భేటీ అయ్యారు. చేనేత సహకార సంఘాల నుంచి చేనేత వస్త్రాల కొనుగోలు, ఇతర సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చేనేతల బాగు కోరే ప్రభుత్వం తమదన్నారు. చేనేత కళాకారులు కాలరు ఎగరేసేలా బతకాలన్నది సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ లక్ష్యమన్నారు. 365 రోజులూ చేనేతలకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 23 నెలల కాలంలో ఆప్కో ద్వారా రూ.190 కోట్ల అమ్మకాలు చేశామన్నారు. ఆప్కో షో రూముల్లో అమ్మకాలు పెంచడానికి సిబ్బందికి శిక్షణ ఇచ్చామన్నారు. ఉచిత విద్యుత్ పథకం ద్వారా నేతన్నల కుటుంబాలకు ఎంతో మేలు కలుగుతోందన్నారు. 90 శాతం సబ్సిడీతో మగ్గం పనిముట్లు అందజేస్తున్నామని, నూలు కొనుగోలుపై 15 శాతం సబ్సిడీ ఇస్తున్నామని తెలిపారు. నేతన్నలకు రెట్టింపు ఆదాయం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సవిత వెల్లడించారు.

**రాబోయే మహానాడులో చేనేత ఎగ్జిబిషన్ ఏర్పాటు**

చేనేత అమ్మకాలకు మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తున్నామని, సోషల్ మీడియాలో విస్తృతం ప్రచారం చేస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా అమ్మకాలు చేస్తున్నామని, 6,770 చేనేత ఉత్పత్తులను 40 ఆప్కో షో రూమ్‌ల ద్వారా ఈ కామర్స్ ద్వారా విక్రయిస్తున్నామని వెల్లడించారు. జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఎగ్జిబిషన్లు నిర్వహిస్తున్నామని, వాటికి విశేష స్పందన లభిస్తోందని తెలిపారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీలో ఆవరణలో ఏర్పాటు చేసిన చేనేత ఎగ్జిబిషన్లకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రుల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. గతేడాది నిర్వహించిన మహానాడు సహా టీటీడీ బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రత్యేక ఎగ్జిబిషన్ స్టాళ్లను ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 27, 28, 29 తేదీల్లో నెల్లూరులో జరిగే మహానాడు సందర్భంగా చేనేత ఎగ్జిబిషన్ స్టాళ్లు ఏర్పాటు చేయబోతున్నట్లు మంత్రి సవిత తెలిపారు.

**నాణ్యమైన వస్త్రాలనే ఆప్కోకు విక్రయించండి...**

చేనేతలకు ఆర్థిక మేలు కలిగేలా చేనేత సహకార సంఘాల చెంతకు వచ్చి చేనేత వస్త్రాలను కొనుగోలు చేస్తామని మంత్రి సవిత స్పష్టంచేశారు. చేనేత వస్త్రాలను ఎప్పటికప్పుడు కొనుగోలు చేస్తామన్నారు. చేనేత అధికారులు స్వయంగా సహకార సంఘాల వద్దకు వచ్చి వస్త్రాలను కొనుగోలు చేస్తారన్నారు. అధికారులు ఇచ్చిన ఇండెంట్‌ను దృష్టిలో పెట్టుకుని నాణ్యమైన వస్త్రాలను, ప్రస్తుత తరం అభిరుచులకు అనుగుణంగా చేనేత వస్త్రాలను తయారు చేసి ఆప్కోకు విక్రయించాలన్నారు. ఆప్కోను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు నేతన్నలపైనా ఉందన్నారు. చేనేత రెడీమేడ్ వస్త్రాలను తయారు చేయాలని, ఇందుకు అవసరమైన శిక్షణ అందించడానికి ప్రభుత్వం సిద్దంగా ఉందని వెల్లడించారు.

**ఆప్కోకు తొలిసారి టీటీడీ ఆర్డర్**

ఆప్కో చరిత్రలో తొలిసారిగా తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి రూ.20 కోట్లకు పైబడి ఆర్డర్ వచ్చినట్లు మంత్రి సవిత తెలిపారు. కండువాలు, దుశ్శాలువాలు, చీరలు, దుప్పట్టాలు, బ్లౌజ్ లను టీటీడీకి అందజేయాల్సి ఉంటుందన్నారు. ఆ వస్త్రాలపై శంకు చక్రాలతో పాటు ఓం నమో వెంకటేశాయ అని ముద్రించాలన్నారు. ఆసక్తి కలిగిన ముందుకొస్తే, టీటీడీకి వస్త్రాలను తయారు చేసే అవకాశమిస్తామని మంత్రి సవిత తెలిపారు. చేనేత వస్త్రాలను ధరించేలా సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ విస్తృతంగా ప్రచారం చేస్తున్నారన్నారు.

నేతన్నల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. నేతన్న భరోసా పథకం కింద రూ.25 వేల ఆర్థిక సాయం అందించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. జౌళి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా మాట్లాడుతూ, నాణ్యమైన వస్త్రాలను మాత్రమే ఆప్కోకు విక్రయించాలని స్పష్టం చేశారు. కమిషనర్ రేఖారాణి మాట్లాడుతూ, చేనేత అమ్మకాలు పెంచేలా మరిన్ని ఎగ్జిబిషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం వివిధ జిల్లాలకు చెందిన చేనేత సహకార సంఘాల ప్రతినిధులు తీసుకొచ్చిన చేనేత వస్త్రాలను మంత్రి సవిత పరిశీలించారు. వాటి ధరలతో పాటు ఏయే ప్రాంతాల నుంచి తీసుకొచ్చారో అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన చేనేత సహకార సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ, పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఉచిత విద్యుత్ పథకం అందజేసినందుకు కూటమి ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు, మంత్రులు నారా లోకేశ్, సవితకు ధన్యవాదాలు తెలియజేశారు.

# టెక్నాలజీ హబ్‌గా ఏపీని తీర్చిదిద్దుతున్నాం : సీఎం చంద్రబాబు



**అమరావతి, (రాజధాని వార్తలు):** జాతీయ సాంకేతిక దినోత్సవం సందర్భంగా శాస్త్రవేత్తలు, ఇన్నోవేటర్లు, యువతకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. పోఖ్రాన్ విజయంతో భారతదేశ సాంకేతిక సామర్థ్యం ప్రపంచానికి చాటిందని పేర్కొన్నారు. జ్ఞానం, పరిశోధన, ఆవిష్కరణల ద్వారానే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని వ్యాఖ్యానించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా సీఎం పోస్టు పెట్టారు.

**టెక్నాలజీ ఆధారిత అభివృద్ధే లక్ష్యం**

భవిష్యత్తు టెక్నాలజీల కోసం ఆంధ్రప్రదేశ్‌లో బలమైన ఎకోసిస్టమ్ నిర్మించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. రాష్ట్ర యువతను ప్రపంచ స్థాయి సాంకేతిక నిపుణులుగా తీర్చిదిద్దేందుకు భారీ స్థాయిలో డీప్‌టెక్ స్కిల్లింగ్ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో IBM SkillsBuild, APSCHE, APSSDC, Quantum Valley భాగస్వామ్యంగా పనిచేస్తున్నాయని వివరించారు.

**ఏఐ, క్వాంటమ్ టెక్నాలజీపై ప్రత్యేక శిక్షణ**

రాష్ట్ర యువతకు క్వాంటమ్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ వంటి అత్యాధునిక రంగాల్లో శిక్షణ అందించనున్నట్లు సీఎం చెప్పుకొచ్చారు. 2026-27 నాటికి రెండు లక్షల మందికి శిక్షణ ఇవ్వాలని తమ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. వచ్చే ఐదేళ్లలో ఈ శిక్షణ కార్యక్రమాన్ని 10 లక్షల మందికి విస్తరించే ప్రణాళికను రూపొందిస్తున్నామని అన్నారు. డిజిటల్ లెర్నింగ్, ఇండస్ట్రీ ట్రైనింగ్, గ్లోబల్ సర్టిఫికేషన్లపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని వెల్లడించారు.

**ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఇన్నోవేషన్ సెంటర్**

ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో NIELIT Innovation, Skilling Centre ఏర్పాటు చేయాలని ప్రతిపాదిస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ కేంద్రంలో క్వాంటమ్ కంప్యూటింగ్, ఏఐ, సెమీకం డక్టర్ టెక్నాలజీలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ విద్యా సంవత్సరం నుంచే కార్యకలాపాలు ప్రారంభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. విద్యార్థులు, పరిశోధకులకు వరల్డ్ క్లాస్ ల్యాబ్స్ అందుబాటులోకి తీసుకు రానున్నట్లు తెలిపారు.

**NPTEL పరీక్షల్లో ఏపీ విద్యార్థుల ప్రతిభ..**

NPTEL జాతీయ పరీక్షల్లో ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు 4 గోల్డ్, 14 సిల్వర్ మెడల్స్ సాధించడం రాష్ట్ర ప్రతిభకు నిదర్శనమని సీఎం చంద్రబాబు ప్రశంసించారు. ఆధునిక టెక్నాలజీ కోర్సుల్లో మరింత మంది విద్యార్థులు పాల్గొని ప్రపంచ స్థాయి అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు.

**క్వాంటమ్ వ్యాలీ విజన్‌తో ముందుకు ఏపీ..**

క్వాంటమ్ వ్యాలీ విజన్ ద్వారా భవిష్యత్ టెక్నాలజీలకు సిద్ధమయ్యే రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దుతున్నామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. ప్రపంచ స్థాయి పరిశోధన, సాంకేతిక నైపుణ్యాలు, స్టార్టప్ అవకాశాలు, ఇండస్ట్రీ కనెక్టివిటీతో ఏపీని టెక్నాలజీ హబ్‌గా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్ర యువతలో నైపుణ్యాలను పెంపొందించడం ద్వారా ప్రపంచ మార్కెట్ అవసరాలకు తగిన మానవ వనరులను తయారు చేయాలని తమ ప్రభుత్వం కృషి చేస్తోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# మద్దిరేవుల ఈడిగపల్లిలో మోటర్ చెడిపోయి త్రాగునీటికి కటకట



**లక్కిరెడ్డిపల్లి, (రాజధాని వార్తలు):** మండలంలోని మద్దిరేవుల గ్రామ సచివాలయం పరిధిలోని ఈడిగపల్లిలో త్రాగునీరు మోటర్ చెడిపోయి వారం రోజులు అయినది. దీంతో త్రాగునీటికి ఇబ్బంది ఏర్పడింది. జీవాలు, ప్రజలు ఇబ్బందులను పట్టించుకొనే నాధుడే కరువయ్యారు. గ్రామ సెక్రటరీని అడుగుదామని ఆయన దృష్టికి తీసుకెళదామంటే సచివాలయానికి రాకుండా లక్కిరెడ్డిపల్లి లోని అన్ని గ్రామ పంచాయతీల సేవలు చేయడానికి అంకితం అయ్యాడని గ్రామస్థులు చెబుతున్నారు. గ్రామంలో త్రాగునీటి కొరతతో ఇబ్బందులు పడుతున్న అధికార పార్టీ గ్రామ నాయకులకు చెపుదామన్న ఫోన్ తీయకుండా కాలం గడుపుతున్న వైనం. త్రాగునీటి కష్టాల ఎవరికి చెప్పుకోవాలి అని మహిళలు అంటున్నారు. ఉన్న మోటర్ చెడిపోయింది మరొక మోటర్ ఉన్న అందులోని త్రాగునీరు సరిపోవటలేదని గంటల తరబడి మండుటెండలో ఉన్నా నీరు రావడం లేదని గ్రామస్థులు అంటున్నారు. బోరులో నీరు సరిపడా ఉన్నప్పటికీ మోటర్ తయారు చేయించే వారు లేరని గతంలో ఎప్పుడూ ఇలాంటి త్రాగునీరు వెతలు చూడలేదని వారు పేర్కొన్నారు. అదేవిధంగా జి ఎం ఆర్ కాలనీ లో కూడా మోటర్ చెడిపోయి త్రాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని ఆ గ్రామస్థులు చెబుతున్నారు. మాజీ సర్పంచ్ తుమ్మల చంద్రమ్మ దృష్టికి విషయం తెలుపగా గతంలో నెహ్రూ నగర్, ఈడిగపల్లిలో కొత్తగా మోటర్లు బిగించి త్రాగునీరు సరఫరా చేసినా మిగతా గ్రామాలలో కూడా మోటర్లు తయారు చేయించి త్రాగునీరు వెతలు తీర్చిన పంచాయతీ అధికారులు ఇప్పటికీ త్రాగునీటి బిల్లులు చెల్లించలేదని జిల్లా అధికారులు, అధికారపార్టీ నాయకులు బిల్లులు నిలుపుదల చేయనున్నారని మండల అధికారిని, గ్రామ సెక్రెటరీ వారిపై సాకులు చెబుతున్నారని ఆవేదన ఆమె వ్యక్తం చేశారు. గత ఐదు సంవత్సరాలలో త్రాగునీటి ఇబ్బందులు ఎప్పుడూ ప్రజలు ఎదుర్కోలేదని అన్నారు. కరోనా సమయంలోనూ ప్రజల ఇబ్బందులు తీర్చామని, త్రాగునీటి కష్టాల బారినా పడకుండా ఆదు కున్నామన్నారు.పంచాయతీ అధికారులు చొరవ చూపి త్రాగునీటి మోటర్ రిపేర్లు చేయాలని ఆదేశిస్తే ఇప్పటికైనా నా వంతుగా త్రాగునీటి సరఫరా ప్రజలకు అందించుటకు కృషి చేస్తానని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలో నిధులు ఉన్నా పాత బిల్లులు చెల్లించకుండా అధికారులు జాప్యం చేయడం ఎంతవరకు సమంజసం అని విమర్శించారు. ఇంత జరుగుతున్న గ్రామ అధికారులు గ్రామ సచివాలయానికి రాకుంటే నేను ఎవరిని సంప్రదించాలని ఆమె పేర్కొన్నారు.

# రెండు సంవత్సరాలుగా గర్భిణీలకు సేవలు





**అమరావతి, (రాజధాని వార్తలు):** రెండు సంవత్సరాలగా గర్భిణీల సేవలో జన చైతన్య సమితి స్వచ్ఛంద సంస్థ అందిస్తున్న సేవలు మరువలేనివని తెలుగు రైతు జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి, బుచ్చయ్యపాలెం మాజీ సర్పంచ్ పరుచూరి పూర్ణచంద్రరావు అన్నారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతిలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో జన చైతన్య సమితి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పెదకూరపాడు మండలం 75 తాళ్లూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గోగులపాటి రమాదేవి, రాజు దంపతుల సహకారంతో గర్భిణీలకు వారి సహాయకులకు భోజనంతోపాటు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు.ఈసం దర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ మానవసేవే మాధవ సేవ అన్న సంకల్పంతో గర్భిణీలకు రెండు సంవత్సరాల నుండి పోషకాహారాన్ని అందిస్తున్న జన చైతన్య సమితి నిర్వాహకులు అభినందనీయులని అన్నారు. గర్భిణీలకు పౌష్టికాహారం అందించటానికి మంచి మనసుతో ముందుకు వచ్చిన గోగులపాటి రాజు కుటుంబ సభ్యులు ఆదర్శనీయులని అన్నారు.రాజు మాట్లాడుతూ సామాజిక సేవలో జనచైతన్య సమితి దశాబ్దాల కాలంగా చేస్తున్న సేవా కార్యక్రమాలకు తమ వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జనచైతన్య సమితి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు దాసరి విజయ్ బెన్నిబాబు, కోఆర్డినేటర్ వెలితోటి అనిల్ కుమార్, వాకా ప్రవీణ్ కుమార్, అందే నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు. భోజనంతో పాటు కోడిగుడ్లు, యాపిల్ కాయలు, దానిమ్మకాయలు, అరటి పండ్లు, డ్రైఫ్రూట్ లడ్లు, కొబ్బరితో తయారు చేసిన ఉండలు, ఖర్జూర పళ్ళు వేరుశనగ విత్తనాలతో తయారు చేసిన వేరుశనగ ఉండలను పంపిణీ చేశారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉన్నాం : యల్లటూరు



**రాజంపేట, (రాజధాని వార్తలు):** స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన పార్టీ సిద్ధంగా ఉన్నట్లు రాజంపేట జనసేన పార్టీ పార్లమెంటు ఇంచార్జి యల్లటూరు శ్రీనివాసరాజు తెలియజేశారు. తిరుపతి కేంద్రంగా జనసేన పార్టీ ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికలపై ఉమ్మడి కడప, చిత్తూరు జిల్లాల జనసేన పార్టీ నాయకులతో స్థానిక సంస్థల ఎన్నికలు, డీ లిమిటేషన్ ప్రక్రియపై ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులు బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆరని శ్రీనివాసులు, టి.సి.వరుణ్‌ల సమక్షంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన నేత యల్లటూరు శ్రీనివాసరాజు పాల్గొని స్థానిక సంస్థ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా తాము సిద్ధంగా ఉన్నామని, రాజంపేట నియోజకవర్గంలో జనసేన పార్టీ బలంగా ఉందని, అభ్యర్థుల గెలుపు కోసం నిరంతరాయంగా పనిచేసి గెలిపించుకుంటామని సభాముఖంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను తక్షణం పరిష్కరించాలి





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రజల సమస్యలను సత్వర పరిష్కారానికి ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, ట్రైనీ కలెక్టర్ పవన్ తేజ, జిల్లా రెవెన్యూ అధికారి విజయకుమార్, తెలుగు గంగ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వంశీకృష్ణ మరియు కేశవర్ధన్ రెడ్డి, డిపిఓ వసుమతి జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ డిప్యూటీ డైరెక్టర్ శేఖర్ తదితరులు ప్రజల నుండి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన అర్జీలను ఆయా శాఖ అధికారులకు పంపిస్తూ తక్షణమే సమస్యలు పరిష్కరించాల్సిందిగా ఆదేశించినట్లు తెలిపారు. సమస్యల పరిష్కారంలో పారదర్శకత వహించడంతోపాటు తగిన వివరాలను ఆయా అర్జీ దారులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలి అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార విషయంలో ఏమైనా సమస్యలు ఉత్పన్నమైతే సదరు విషయాలను పై అధికారుల దృష్టికి తీసుకుని వచ్చి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సుదూర ప్రాంతాల నుండి వచ్చిన వారికి నిలువ నీడను ఉండే విధంగా షామియాలను ,కుర్చీలు ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యేక క్యూ లైన్‌లను మరియు తాగునీటి వసతిని ఏర్పాటు చేయడం, దివ్యాంగుల వారికి ప్రత్యేక క్యూ లైన్ ఏర్పాటు చేశారు. అంతేకాకుండా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని కూడా ఏర్పాటు చేయడం జరిగింది.

# ప్రకృతి అందాలను కాపాడుకోవాలి

## - బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పి వి ఎన్ మాధవ్ పిలుపు



**వరదయ్యపాలెం, (రాజధాని వార్తలు):** సృష్టి ఇచ్చిన వనరులను, ప్రకృతి ఇచ్చిన అందాలను, సమస్త జీవరాసులను ప్రకృతి అందాలను కాపాడుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పి వి ఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. వరదయ్యపాలెం మండలంలోని ఏకం క్యాంపస్ టులో తిరుపతి జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు సామంచి శ్రీనివాసులు అధ్యక్షతన రెండు రోజులు పాటు జరిగిన ప్రశిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని పార్టీ నాయకులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ఏకం సమస్త ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. సృష్టి ఇచ్చిన వనరులను, ప్రకృతి ఇచ్చిన అందాలను, సమస్త జీవరాసులను కాపాడుకోవటం మన ధర్మం అన్నారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలు కేవలం ఎన్నికల యంత్రాంగాలుగా కాకుండా, సమాజాన్ని మార్గనిర్దేశం చేసే శక్తులుగా ఉండాలని, ఆదిశగా బీజేపీ నిర్వహిస్తున్న ప్రశిక్షణ కార్యక్రమాలు పార్టీ శ్రేణులకు ఆలోచనా దార్శనికతను అందిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ పార్టీ నాయకులకు ఇచ్చిన దిశానిర్దేశం ఈ నేపథ్యంలో ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రస్తుత కాలంలో రాజకీయ నాయకత్వం కేవలం అభివృద్ధి పనులకే పరిమితం కాకుండా, సమాజానికి విలువలను చేరవేయాల్సిన బాధ్యతను కూడా కలిగి ఉంది. మాధవ్ తన ప్రసంగంలో సృష్టి ఇచ్చిన వనరులను, ప్రకృతి అందాలను, సమస్త జీవరాసులను కాపాడుకోవడం మన ధర్మం అని చెప్పారు. తద్వారా రాజకీయ చర్చను ఒక ఉన్నత స్థాయికి తీసుకెళ్లారు. ఇది కేవలం పర్యావరణ పరిరక్షణ అంశం మాత్రమే కాకుండా, భవిష్యత్ తరాల పట్ల మన బాధ్యతను గుర్తు చేసే సందేశంగా భావించాలి. ఇటీవలి కాలంలో అభివృద్ధి పేరుతో ప్రకృతి వనరుల వినియోగం అధికమవుతున్న నేపథ్యంలో, వాటి సంరక్షణపై రాజకీయ నాయకత్వం స్పష్టమైన దృక్పథం కలిగి ఉండటం అవసరం. ఈ అంశంపై పార్టీ స్థాయిలో చర్చలు జరగడం, శ్రేణులకు అవగాహన కల్పించడం వంటి చర్యలు సమాజానికి సానుకూల సంకేతాలు ఇస్తాయన్నారు. ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు నాయకుల్లో క్రమశిక్షణ, సిద్ధాంతపరమైన అవగాహన, సామాజిక బాధ్యతలను పెంపొంది స్తాయని తెలి పారు. మొత్తానికి, రాజకీయాల్లో విలువల ఆధారిత దృక్పథం పెంపొందించాల్సిన అవసరం ఉన్న ఈ సమయంలో, ఇలాంటి కార్యక్రమాలు కేవలం పార్టీకి మాత్రమే కాకుండా సమాజానికి కూడా ఉపయోగకరంగా నిలుస్తాయన్నారు. పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యత, సుస్థిర అభివృద్ధి వంటి అంశాలను రాజకీయ అజెండాలో భాగం చేయడం ద్వారా భవిష్యత్తుకు బలమైన పునాది వేయవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగారెడ్డి దయాకర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు, కోలా ఆనంద్, జల్లి మధుసూదన్, బాచి, రాష్ట్ర అధికార ప్రతినిధులు, టీటీడీ బోర్డు మెంబర్ భానుప్రకాష్ రెడ్డి, జాతీయ కౌన్సిల్ మెంబర్ ముని సుబ్రహ్మణ్యం, జిల్లా జనరల్ సెక్రెటరీలు బీడీ బాలాజీ, సత్యవేడు మునికృష్ణయ్య, డాక్టర్ నరేష్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు గోపి ఆచారి, జిల్లా ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం రెడ్డి, రాష్ట్ర ఓబిసి మోర్చా ఎక్స్ కార్యదర్శి, సిద్దులయ్య, వరదయ్యపాలెం లోకల్ మండల అధ్యక్షులు దిలీప్ రాయల్, స్థానిక నాయకులు వేలూరు పురుషోత్తం, కంద్రిక ఉమా, తేజవతి, ఇందు అంకమ్మ వేలూరు సూర్యనారాయణ, బొగ్గల సుబ్రహ్మణ్యం, ఏసు, ప్రసాద్, అన్వేష్ నాగేశ్వరరావు, గోపి అంకయ్య ఎంజే కుమార్, భాస్కర్‌రెడ్డి సుబ్బరత్నమ్మ, ఆర్ మురళి, సుబ్రహ్మణ్యం, నలుమూలల నుండి బీజేపీ ముఖ్య నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# జడ్పీ హైస్కూల్ 10వ తరగతి విజేతలకు ఘన సత్కారం







**కరప, (రాజధాని వార్తలు):** కాకినాడ రూరల్ కరప మండలం వేళంగి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 2025-26 పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన కరప మండల విద్యార్థులకు అభినందన కార్యక్ర మాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పంతం నానాజీ ఆదేశాలు, సహకారంతో పాఠశాల ప్రధానో పాధ్యాయుడు త్రిమూర్తులు అధ్యక్షత వహించారు. కరప మండల ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 44 మంది విద్యార్థులు 550కి పైగా మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించి ప్రభంజనం సృష్టించారు. వారిని అతిథుల చేతుల మీదుగా మెమెంటోలు, దుస్సాలువులు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కృషి, పట్టుదలతో చదివితే అద్భుతమైన ఫలితాలు సాధించగలరని ఈ విజయాలు నిరూపించాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులు కూడా ప్రైవేట్ పాఠశా లలకు ఏమాత్రం తీసిపోరని, సరైన మార్గదర్శకత్వం, ఉపాధ్యాయుల కృషి ఉంటే ఉన్నత స్థాయికి ఎదగవచ్చని అన్నారు. ఈ విజయాలు ఇతర విద్యార్థులకు ప్రేరణగా నిలవాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయుల శ్రమ, తల్లిదండ్రుల ప్రోత్సాహం, విద్యార్థుల పట్టుదల కలిసి ఈ విజయాలకు కారణ మయ్యాయని కొనియాడారు. భవిష్యత్తులో ఇంకా ఎక్కువ మంది విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షిస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కటకంశెట్టి బాబీ, చప్పిడి వెంకటేశ్వరరావు, పితాని లీల, ముద్రగడ రమేశ్, బండారు మురళి, కొల్లా బత్తుల అప్పారావు, మెండు గోవింద్, దేవు వెంకన్న, జోకా తాతాజీ, పద్మావతి, మెర్ల వీరయ్య చౌదరి, ముత్యాలరావు, ప్రసాద్, శాఖ శ్రీనివాస్, భాస్కర్ తమ్మయ్య, నెహ్రూ, దూడల నారాయుడు, బండారు మణికంఠలు, తహసీల్దార్ తుమ్మల దుర్గాప్రసాద్, ఎంపీడీవో జటావల్ల భుల శ్రీనివాస్, మండల విద్యాధికారులు కె.బుల్లి కృష్ణవేణి, పి.సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో హాజరై విద్యార్థులను అభినందించారు.

# పదవ తరగతి పరీక్షా ఫలితాల జిల్లా టాపర్‌ను సత్కరించిన డాక్టర్ చెన్నయ్య









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా చేజర్ల మండలం నాగుల వెల్లటూరుకు చెందిన కొర్రకూటి వెంకటేశ్వర్లు, లక్ష్మీ ప్రసన్న కుమార్తె యశ్విత జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి 10వ తరగతిలో 595 మార్కులు సాధించి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ఆదివారం నాగులవెల్లటూరులోని యశ్విత స్వగృహంనందు పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డాక్టర్ చీదరాల చెన్నయ్య సౌజన్యంతో యశ్వితను మొమెంటో, శాలువా, మెడల్, మాల, కిరీటం, 3016 నగదు బహుమతితో ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా డాక్టర్ చీదరాల చెన్నయ్య మాట్లాడుతూ విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ వినూత్నమైన ఆలోచనా విధానంతో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల అత్యుత్తమ భోధనతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంతటా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులందరూ విజయదుందుభీ మోగించారని తెలిపారు.

అసోసియేషన్ అధ్యక్షులు కె.మురళీమోహన్ రాజు మాట్లాడుతూ మట్టిలో మాణిక్యాలాంటి విద్యార్థులను ప్రోత్స హిస్తున్న డాక్టర్ చీదరాల చెన్నయ్య తన సొంత నిధులతో ఇటు వంటి విద్యార్థులను ప్రోత్సహిస్తున్న చీదరాల చెన్నయ్య భవిష్య త్తులో మరింత సేవ చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో యశస్వి తల్లిదండ్రులు వెంకటేశ్వర్లు, లక్ష్మీ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సునీల్ కుమార్‌కు ధన్యవాదాలు తెలిపిన నేతన్నలు



**గూడూరు, (రాజధాని వార్తలు):** ఎన్నికల ప్రచారంలో నేతన్నలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ వాడకం ఇచ్చిన హామీని ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అమలుపరిచారు. గూడూరు మున్సిపల్ పరిధిలోని చెన్నూరు గ్రామానికి చెందిన అందుకు నేతన్నలు రాష్ట్ర పార్టీ కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి ఆధ్వర్యంలో గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే రాష్ట్ర టిడిపి ప్రధాన కార్యదర్శి డాక్టర్ పాశిం సునీల్ కుమార్‌ను కలిసి స్వయంగా నేసిన చీరలను ఎమ్మెల్యేకి అందించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా నేతన్నలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నూరు శాతం అమలపరుస్తున్నారని అందులో భాగంగానే తమ సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ ఉచిత విద్యుత్తు పథకం వల్ల వల్ల గూడూరు నియోజకవర్గం నందు 332 చేనేత కుటుంబాలకు లబ్ది చేకూరిందనికూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం అభివృద్ధిని గుర్తు పెట్టుకొని రాబోయే ఎన్నికల్లో ఓట్లు వేయాలన్నారు. ఈ కార్యక్ర మంలో వీవర్స్ ఆఫీసర్ ప్రసాద్, మాజీ చేనేత సొసైటీ అధ్యక్షుడు కటికాల శ్రీనివాసులు, రాజనాల, మధిర రవి, చలపతి, ఆర్ శ్రీనివాసులు, వెంకటప్పయ్య, చేనేతలు, మహిళా కార్మికులు పాల్గొన్నారు.

# కార్యకర్తకే మొదటి ప్రాధాన్యత...!

## - పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

## - నియోజకవర్గ స్థాయి సమావేశంలో నేతల పిలుపు





**సామర్లకోట, (రాజధాని వార్తలు):** వైసీపీ పార్టీలో కార్యకర్తకే తొలి ప్రాదాన్యత ఇచ్చే విధంగా వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రణాళిక రచించి, గ్రామ స్థాయి నుండి పార్టీ బలోపేతం దిశగా అడుగులు వేస్తున్నారని పలువురు వక్తలు అన్నారు. సామర్లకోట లారీ యూనియన్ ఆఫీసు సమీపంలోని సూర్య కళ్యాణ మండపంలో పెద్దాపురం నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం పెద్దాపురం కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సమావేశంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జెడ్పీ చైర్మన్ విప్తర్తి వేణుగోపాలరావు, మాజీ ఎమ్మెల్సీ, కాకినాడ పార్లమెంట్ పరిశీలకులు సూర్యనారాయణ రాజు, పెద్దాపురం నియోజకవర్గం పరిశీలకులు నక్కా శ్రీ గణేష్, కాకినాడ జిల్లా బూత్ కమిటీ అధ్యక్షులు ఒమ్మి రఘురామ్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏ కార్యకర్తను వదులుకోదని పార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి గతంలోనే స్పష్టం చేసారన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసిపి అత్యధిక విజయం పొందుతుందని, దానికి కార్యకర్త స్థాయి నుండి అన్ని కమిటీల నాయకులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

పార్టీలో కష్టపడిన ప్రతి కార్యకర్త రానున్న రోజుల్లో అన్ని విధాల గుర్తింపు పొందే విధంగా జగన్మోహన్ రెడ్డి కార్యాచరణ రూపొందిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో పాల్గొన్న రేపటి నుండే వార్డు స్థాయిలో పర్యటించి కార్యకర్తలందరినీ ఏక తాటిపైకి తీసుకు రావాలన్నారు. తద్వారా పార్టీ బలోపేతానికి కష్టపడి రానున్న రోజుల్లో మరలా జగన్మోహన్ రెడ్డిని రాష్ట్ర ముఖ్యమంత్రిగా నిలువ పెట్టేందుకు ప్రతివారు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ నాయకులు నెక్కంటి సాయిప్రసాద్, ఆవాల లక్ష్మీనారాయణ, ఊబా జాన్ మోజెష్, పాగా సురేష్ కుమార్, ఇరుసుమళ్ళ సాయి, సామర్లకోట, పెద్దాపురం ఎంపీపీలు బొబ్బరాడ సత్తిబాబు, జెడ్పీటీసీలు, పార్టీ అనుబంధం విభాగాల అధ్యక్షులు, వార్డు, పట్టణ, మండల కమిటీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## ఇరాన్‌కు అంతటి శక్తి ఎక్కడిది?

ఇరాన్ అమెరికాల మధ్య జరుగుతున్న యుద్ధం తాలూకు ఆర్థిక ప్రభావం ప్రపంచం మీద పెరుగుతోంది. ఈ రెండు దేశాల మధ్య ఒక శాంతి సయోధ్య ఎప్పుడు కుదురుతుందా అని ప్రపంచ దేశాలన్నీ వేయి కళ్లతో ఎదురుచూస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ యుద్ధాన్ని గెలిచేశానని ప్రకటించుకుంటూ, హోర్ముజ్ జలసంధికి వెయ్యి కిలోమీటర్ల దూరంలో నిల్చుని డాంబికాలు పలుకుతున్నాడు. కానీ వాస్తవం వేరేలా ఉంది. అత్యంత ధనిక దేశమూ, సైనికంగా శక్తిమంతమైన దేశమై ఉండి కూడా అమెరికా గగనతలం నుంచి ఇరాన్‌పై బాంబులు, టాంహాక్ క్షిపణులు వేయడం తప్ప ఇరాన్ నేల మీద కాలు పెట్టే సాహసం చేయడం లేదు. ఈ హోర్ముజ్ దిగ్బంధం ఇంకా ఇలా ఎన్నాళ్ళు కొనసాగుతుందో ఎవరికీ అంచనాకు చిక్కటం లేదు. అమెరికా నుంచి ఇండియా వరకు చమురు గ్యాస్ ధరల మంటలు ప్రజల్ని తాకుతున్నాయి. ఎవరు ముందు తలొగ్గుతారు, నష్టాన్ని సుదీర్ఘ కాలం భరించే శక్తి ఎవరికుందీ అన్న బలాబలాల పరీక్షగా ఇది కొనసాగుతున్నది. అందరూ ఇరాన్ తలొగ్గుతుందని ఎదురుచూస్తున్నారు. కానీ వాస్తవానికి ఒకప్పటికీ ఇప్పటికీ భౌగోళిక రాజకీయాలు చాలా మారిపోయాయి. ఇరాన్ నేడు ఒక శక్తిమంతమైన దేశంగా పునరుత్థానం పొందింది. 1971 నాటికి మధ్య ఆసియాలో చమురు ఉన్న దేశాలు, తక్కిన దేశాలు అన్నీ అమెరికా సమర్థక దేశాలుగా మారిపోయి ఉన్నాయి. కానీ ఇరాన్ మాత్రం లొంగలేదు. ఇరాన్‌లో అమెరికా తెచ్చిపెట్టిన పాలకుడు రెజా పహ్లవి షా పట్ల క్రమంగా వ్యతిరేకత మొదలైంది. పాశ్చాత్య సంస్కృతి పట్ల, ముఖ్యంగా స్త్రీలు పాశ్చాత్య దుస్తులు వేసుకోవడం పట్ల కింది వర్గం పురుషుల నుంచి ఒక పితృస్వామ్య భావజాలంతో కూడిన ప్రతిఘటన మొదలైంది. ఇస్లామిక్ విలువలు ధ్వంసం అవుతున్నాయని సనాతనవాదుల నుంచి వ్యతిరేకత మొదలైంది. వియత్నాంలో అమెరికా యుద్ధం, అల్జీరియాలో ఫ్రాన్స్ ఘాతుకం, పాలస్తీనాపై ఇజ్రాయెల్ దురాక్రమణ వంటి పరిణామాల తర్వాత అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఇరాన్‌లో ప్రజాభిప్రాయం గట్టిగా నాటుకుంది. ఖొమైనీ, అతని సమర్థకులు ఇరాన్‌ను ఒక ఇస్లామిక్ గణతంత్ర రాజ్యంగా ప్రకటించారు. 'ఇస్లామిక్ విప్లవ రక్షణ సమితి' అనే ఒక సాయుధ మిలిటరీ అనుబంధ సంస్థను స్థాపించారు. 1979లో దేశంలో అన్ని వ్యవస్థలనూ స్వాధీనం చేసుకుని ఒక ఇస్లామిక్ రాజ్యానికి స్థాపన చేశారు. ఎమర్జెన్సీ డిక్లేర్ చేసి వామపక్షవాదుల్ని, రెజా పహ్లవీ షా సమర్థకులందరినీ జైల్లో వేశారు. ఇస్లామిక్ కౌన్సిల్ నిర్ణయించిన పరిధిలో ప్రజాస్వామ్యం అమలు అయ్యే వ్యవస్థను తయారు చేశారు. పేద వర్గాల కనీస అవసరాలను ఫ్రీ రేషన్ ద్వారా తీరుస్తూ ప్రజాదరణ పొందారు. అమెరికాను ప్రపంచ శత్రువుగా ప్రకటించి, 'అమెరికా చావు రావాలి' అని నినాదాలు ఇచ్చి, ప్రచార మాధ్యమాల్లో రోజూ అమెరికాని అవమానించే ప్రకటనలు చేసేవారు. 1979 విప్లవం జరిగిన కొన్ని నెలలకు ఒక రోజు వందమంది విద్యార్థులు అమెరికా రాయబార కార్యాలయంలోకి వెళ్లి, 64 మంది దౌత్య సిబ్బందిని బందీలుగా పట్టుకున్నారు. వారిని విడిపించడానికి 'ఆపరేషన్ ఈగిల్ క్లా' పేరుతో అమెరికా కమెండోలను పంపిస్తే వారి హెలికాప్టర్లు ఇరాన్ ఎడారిలో కూలిపోయాయి. చివరికి అమెరికా ఏడాదిపాటు బతిమిలాడి, ఇరాన్‌కి చెందిన 8 బిలియన్ డాలర్లను ఇచ్చిన తర్వాతే బందీలకు విముక్తి లభించింది. ఇది ఇరాన్‌కు అతి పెద్ద విజయం. అమెరికా ప్రెసిడెంట్ జిమ్మీ కార్టర్‌కు అతిపెద్ద అవమానం. అప్పటి నుంచి ఇరాన్‌లో ప్రభుత్వాన్ని మార్చడం దీర్ఘకాలిక లక్ష్యంగా అమెరికా ఎదురు చూస్తూనే ఉంది. 1981లో ఇరాక్ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్‌ని ఉసిగొలిపి ఇరాన్‌పై ఒక విఫల యుద్ధం చేయించింది. ఎనిమిదేళ్ళ ఆ యుద్ధంలో ఇరాన్ అజేయంగా నిలవడమే గాక తమ దేశాన్ని ఎలా నిర్మాణం చేయాలో, ఎలా రక్షించుకోవాలో నేర్చుకుంది. ఒక దీర్ఘకాలిక రక్షణ వ్యూహాన్ని కూడా అమలు చేయటం ప్రారంభించింది. పాలస్తీనా అంశాన్ని అన్ని గల్ఫ్ దేశాలూ వదిలేసి, అబ్రహం తీర్మానం అని ఇజ్రాయెల్‌తో వాణిజ్య సంబంధాలు పెట్టుకున్న సందర్భంలో, ఇరాన్ మాత్రం అన్ని నష్టాలనూ భరిస్తూ, పాలస్తీనా ప్రజలకు తన ధర్మంగా మద్దతు ఇచ్చింది. 1984లో లెబనాన్‌లో హిజ్బుల్లా సంస్థను నిర్మించి, లెబనాన్‌ను ఇజ్రాయెల్ ఆక్రమణ నుంచి విముక్తి చేసి కాపాడే శక్తిగా దాన్ని రూపొందించింది. 1991లో సోవియెట్ యూనియన్ పడిపోయిన దశలో సిరియాకు మద్దతు ప్రకటించి ఇజ్రాయెలీ దాడుల నుంచి రక్షించే బాధ్యతను తీసుకుంది. తమపై టెర్రరిస్టు దేశం అనే ముద్రపడినా భయపడకుండా తన నైతిక కోణాన్ని ఇరాన్ స్పష్టంగా అన్ని విధానాల్లో అమలు చేసింది. అమెరికా వ్యతిరేక రాజకీయాల వల్ల ఇరాన్ చాలా నష్టపోయిన మాట వాస్తవం. అమెరికన్ ఆంక్షల వల్ల తన చమురును చవకగా అమ్ముకుని ఆదాయాన్ని కోల్పోవాల్సి వచ్చింది. అయినప్పటికీ, ఇరాన్ తన అంతర్గత అధికారాన్ని నిలబెట్టుకోగలిగింది. ఆత్మనిర్భరతను నిర్మించుకోవడానికి యూనివర్సిటీల్లో సైన్స్ టెక్నాలజీ విద్యలకు ప్రాధాన్యమిచ్చింది. అణు విద్యుత్, వ్యవసాయ సాంకేతికత, పెట్రో కెమికల్స్, కెమికల్స్ వంటి రంగాల్లో భారీగా అభివృద్ధి సాధించింది. విచిత్రంగా, ఒకపక్క హిజాబ్ వేసుకోవాలని బలవంతపెడుతూనే, స్త్రీలను ఆరోగ్య, విద్య, సాంకేతిక రంగాల్లో విపరీతంగా ప్రోత్సహించింది. ముస్లిం దేశాల్లో అత్యధికమైన మహిళా కార్మికులు గలిగిన ప్రత్యేకమైన దేశంగా ఎదిగింది. రెజా పహ్లవి షా మొదలుపెట్టిన అణు ఇంధన కార్యక్రమాన్ని ఇరాన్ పునరుద్ధరించింది. దీనితో ఆ దేశం అణు బాంబు తయారు చేస్తోందని ఇజ్రాయెల్ పుకార్లు పుట్టించింది, ఇరాన్‌పై అమెరికా ఆర్థిక ఆంక్షలు విధించింది. ఎమర్జెన్సీ మందులు కూడా దిగుమతి చేసుకోనీకుండా అమెరికా నిషేధం విధించింది.

# టీవీకే గెలుపు చంద్రబాబుకు షాక్

**- జగన్మోహన్ రెడ్డి గెలుపునకు ఇదే నాంది - చంద్రబాబు దోచుకున్న ప్రతి రూపాయికి లెక్క చెప్పాల్సిందే - 2029 ఆంధ్ర ఎన్నికల్లో జగన్ విక్టరీ విజయం ఖాయం - తమిళనాడు విజయ్ గెలుపుపై జగదాంబ, పూర్ణ మార్కెట్‌లో సంబరాలు నిర్వహించిన వాసుపల్లి**





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** తమిళనాడు ఎన్నికల ఫలితాల్లో సింగల్ లార్జెస్ట్ పార్టీగా దళపతి విజయ్ నేతృత్వంలో టీవీకే పార్టీ విజయంపై మాజీ ఎమ్మెల్యే దక్షిణ నియోజక వర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ అభినందనలు తెలిపారు. జగదాంబ జంక్షన్, పూర్ణ మార్కెట్ దుర్గాలమ్మ ఆలయ జంక్షన్ వద్ద వైసీపీ శ్రేణులతో కలిసి బాణాసంచా కాల్చి సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయ్ విజయం / చంద్రబాబుకు షాక్ తగిలిందన్నారు. 2029 ఆంధ్ర ఎన్నికల్లో ఇదే రిపీట్ అవుతుందన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రజల్లో గూడు కట్టుకున్నారన్నారు. వైయస్ జగన్ మోహన్ రెడ్డి, విజయ్‌ల మధ్య స్నేహంతో దిగిన ఫోటో ఇప్పుడు నెట్టింటా వైరల్ అవు తుందని వాసుపల్లి అన్నారు. జగన్ అభినందనల నేపథ్యంలో సోషల్ మీడియాలో మరోసారి జగన్–విజయ్ స్నేహానికి సంబం ధించిన వీడియోలు, ఫోటోలు ట్రెండ్ అవుతున్నాయి. ఏ పార్టీ తోనూ పొత్తు పెట్టుకోకుండా, తన బలాన్ని నమ్ముకుని సింగిల్‌గా పోటీ చేసిన విజయ్‌ను ఏపీలోనూ అదే ధైర్యంతో ముందుకు సాగే జగన్‌తో నెటిజన్లు పోల్చుతున్నారనీ చెప్పారు. ఎన్నికల ప్రచారంలో విజయ్ గతంలో జగన్ ఫోటోను ప్రదర్శించిన వీడియోలు, ఇద్దరు నేతలు కలిసి ఉన్న పాత దృశ్యాలు "రియల్ పొలిటికల్ లీడర్స్" అనే ట్యాగ్‌తో చంద్రబాబు లోకేష్ గుండెల్లో గుబులు పుడుతున్నాయని వెల్లడించారు. చిన్న 1000 వాలా టపాకాయలు వెలిగిస్తే రచ్చ చేస్తున్న పోలీసులు తీరు హాస్యాస్పదమన్నారు. ఈ సంబరాలు జగదాంబ జంక్షన్‌లో జరుపుకుంటే పోలీసులు అడ్డుకోవడం విచారకరమన్నారు. కూటమి నేతలకు కొమ్ముకాస్తున్న పోలీసులు తీరు మార్చుకోవాలన్నారు. ఆంధ్రాలో చంద్రబాబు చేస్తున్న అరాచకాలు, అవినీతి చేస్తున్న ప్రతి ఒక్క రూపాయి సమాధానం చెప్పాలన్నారు. 2027 లో జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ప్రతిరోజు చంద్రబాబు లోకేష్‌లకు సినిమా చూపిస్తారని వాసుపల్లి హెచ్చరించారు. వేల కోట్ల రూపాయల ప్రజల సొమ్మును అమరావతిలో ఎవరి కోసం దార బోస్తున్నారని వాసుపల్లి ప్రశ్నించారు. అద్దాల మేడకు రూ. 2,900 కోట్లు ఖర్చు చేయడం చంద్రబాబు దుబారా ఖర్చులకు నిదర్శనం అన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం తీరు మార్చుకోకపోతే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో దక్షిణ వార్డు అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు సీనియర్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రవికుమార్ త్వరగా కోలుకోవాలి

**- నిలకడగానే ఆరోగ్యం - ఆసుపత్రి వర్గాలతో చర్చించిన గంట్ల**



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ఎన్ఏడి ప్రాంతానికి చెందిన జర్నలిస్టు రవికుమార్ త్వరగా కోలుకోవాలని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి ఎన్ఏజే ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు ఆకాం క్షించారు. సోమవారం ఆరిలోవ అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రవికుమార్ ఆరోగ్య పరిస్థితి పరిశీలించిన అనంతరం గంట్ల శ్రీనుబాబు అక్కడ వైద్య వర్గాలను ప్రస్తుత పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఐసీయులో చికిత్స పొందుతున్న రవి కుమార్ ఆరోగ్య పరిస్థితి నిన్నటి కంటే కొంత మెరుగ్గా ఉందని వైద్య వర్గాలు తెలిపారు. ఆదివారం 100 శాతం ఆధునిక యం త్రాల సాయంతో ఆక్సిజన్ సపోర్ట్ ఇవ్వగా 94 తో నిలకడగా ఉంది. సోమవారం 60 శాతం యంత్రాల సపోర్టు ఇచ్చినప్పటికీ 94/20 కింద నిలకడగా ఉంది అని వైద్యులు చెప్పారు. అయితే ఆదివారం కంటే సోమవారం కొంత మెరుగ్గా ఉందని అప్పుడే ఏమి చెప్పే పరిస్థితి లేదని వైద్యులు చెప్తున్నారు. యంత్రాలు సపోర్ట్ లేకుండా సొంతంగా ఆక్సిజన్ అందుబాటులోకి రావాలని వైద్యులు పేర్కొన్నారన్నారు. ప్రస్తుతం రవికుమార్ ఆరోగ్యం కొంత ఆందోళనకరంగానే ఉంది తమ ప్రయత్నం తాము చేస్తున్నామని ముందే అపోలో ఆసుపత్రికి తరలించినట్లయితే చాలావరకు రికవరీ ఉండేదని అపోలో సీఈవో కృష్ణ ప్రసాద్ తన అభిప్రాయాన్ని వెల్లడించారు. సీఈఓతో కూడా గంట్ల శ్రీనుబాబు రవి కుమార్ ఆరోగ్య పరిస్థితిపై సుమారు పది నిమిషాలకు పైగా చర్చించారు. అలాగే ఐసీయూలో ఉన్న వైద్యులతో చర్చించి అన్ని విషయాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం స్టార్ ఇన్సూరెన్స్ ద్వారా చికిత్స అందిస్తున్నామనీ రవికుమార్ సోదరుడు కుమారుడు పవన్ తెలిపారు. ఇక అది పూర్తి కావస్తే అప్పుడు ఆరోగ్యానికి సంబంధించి భారీగా అమౌంట్ అవసరం అవుతుంది. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రయత్నం చేసినప్పటికీ ఎంతవరకు సహాయం అందుతుందన్నది చూడాల్సి ఉంది. కాబట్టి అందరూ ఈ విషయంపై ఆలోచించి ఎవరు పరిధి బట్టి వారు సహాయం అందించాల్సి ఉంటుంది. ఆ సింహాద్రి నాథుడు ఆశీస్సులతో ఎవరో ఒకరు దారి చూపిస్తారని ఆశిస్తున్నాను.

# ఘనంగా ఎల్ఐసి ఏజెంట్స్ సక్సెస్ మీట్





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** భారతీయ జీవిత భీమా సంస్థ యలమంచిలి బ్రాంచి పరిధిలోని ఏజెంట్ల సక్సెస్ మీట్ కార్యక్రమం ఆదివారం నాడు వెంకటేశ్వర ఫంక్షన్ హాలులో ఘనంగా జరిగింది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఏజెంట్స్ సక్సెస్ మీట్ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుండి ఏజెంట్లు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని డెవలప్మెంట్ ఆఫీసర్ కె.పి.ఆర్.పవన్ కిరణ్ స్వాగత ప్రసంగం మరియు ప్రేరణాత్మక గీతంతో వేడుకలకు శ్రీకారం చుట్టారు. అనంతరం ప్రముఖ మెంటర్లు బి.రామారావు, కె. సూర్యప్రసాద్, ఎం.హరీష్, ఎల్.రవిచంద్ర, జెడ్.అనూష, డి. వరలక్ష్మి తమ అనుభవాలను పంచుకుంటూ వ్యాపార విజయ సాధనకు అవసరమైన వ్యూహాలను, మెళకువలను ఏజెంట్లకు వివరించారు. భీమా రంగంనందు భారత్‌లో మొదటి స్థానంలో ఉన్న భారతీయ జీవిత భీమా సంస్థలో తామంతా భాగస్వాములైనందుకు గర్వంగా ఉందని తెలిపారు. నమ్మకమైన ఎల్ఐసి సంస్థ జారీ చేసే పాలసీలను పాలసీదారులకు నాణ్యమైన సేవలు ఏజెంట్లు అందిస్తూ, పాలసీదారుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కలిగిస్తున్నారని తెలిపారు. కస్టమర్లకు ఖచ్చితత్వంతో కూడిన నాణ్యమైన సేవలు అందించడం ద్వారా ఏజెంట్లు విజయం సాధిస్తూ పురోగతి చెందుతారని మెంటార్లు పేర్కొన్నారు. ప్రతి ఏజెంట్ తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్ధారించుకుని క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా గత ఆర్థిక సంవత్సరంలో విశేష ప్రతిభ కనబరిచిన టాప్ ఏజెంట్లను దంపతుల సమేతంగా శాలువాతో సత్కరించి జ్ఞాపిక ట్రోఫీలను అందజేశారు. అలాగే ప్రీమియం, పాలసీల సంఖ్య, సగటు ప్రీమియం మరియు కన్‌సిస్టెంట్ పెర్ఫార్మెన్స్ వంటి విభాగాలలో అత్యుత్తమ ప్రదర్శన చేసిన వారికి ట్రోఫీలు అందజేశారు. ఈ సత్కారం ఇతర ఏజెంట్లకు మరింత ప్రేరణ కలిగించింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు తమ అనుభవాలను పంచుకుంటూ, భవిష్యత్తు లక్ష్యాలపై చర్చించారు. ఈ మీట్ ద్వారా ఏజెంట్ల మధ్య ఐక్యత మరింత బలపడటంతో పాటు, కొత్త ఉత్సాహంతో ముందుకు సాగేందుకు ప్రేరణ లభించింది. ముగింపులో నిర్వాహకులు అందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తూ, రాబోయే సంవత్సరంలో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

## చిన్న వ్యాపారులకు కూటమి ప్రభుత్వం అండ



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో చిరు వ్యాపారులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప అన్నారు. పెద్దాపురం పట్టణం దర్గా నగర్ సెంటర్‌లో గంగాభవానీ పిషర్ మెన్ కో ఆఫ్ రేటివ్ సొసైటీ, సిద్ధి వినాయక చేపల యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పిష్ మార్కెట్‌ను ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప మాట్లాడుతూ చిన్న వ్యాపారులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటూ కుటుంబ ఆర్థిక భద్రత కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వం నుంచి రుణాలు వంటి కార్యక్రమాల ద్వారా వ్యాపారులకు పూర్తి సహకరణ అందించినట్టు ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, నాయకులు కొరుపూరి రాజు, గెడ్డం పెదకాపుతో పాటు కూటమి నాయకులు, వ్యాపారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తడిచిన ధాన్యాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

**- రైతులు ధైర్యంగా ఉండాలని భరోసా**



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** అకాల వర్షానికి తడిసిన ప్రతిదాన్ని గింజను ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసేందుకు చర్యలు వేగవంతం చేస్తుందని, ఈ విషయంలో రైతులు ధైర్యంగా ఉండాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప అన్నారు. సామర్లకోట పట్టణంలోని శ్రీ కుమార రామ భీమేశ్వరాలయ పరిసర ప్రాంతాల్లో కళ్ళల్లో తడిచిన ధాన్యాన్ని ఎమ్మెల్యే చినరాజప్ప తెదేపా నాయకులు రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల భారీ వర్షాల కారణంగా కళ్ళల్లో ఉన్న రైతుల ధాన్యం మొత్తం పాడైందన్నారు. ఈ భారీ వర్షం కారణంగా రైతులు ఇబ్బందులకు గురవుతున్నందున వారి నాదుకొంటూ రైతుల ధాన్యాన్ని సప్పవరం కొనుగోలు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. అయితే మరో రెండు మూడు రోజులపాటు వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతులు దాన్యాన్ని కళ్ళాల్లో ఉంచుకోకుండా జాగ్రత్త పరచుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కంటే జగదీష్ మోహన్, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, బలుసు శ్రీనివాస్, వల్లూరి దొరబాబు, అందుగుల జార్జి చక్రవర్తి, ఫైణ్ణి శ్రీనివాసరావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

## వాణిజ్య గ్యాస్ ధర తగ్గించాలంటూ ధర్నా




**సామర్లకోట, (రాజధాని వార్తలు):** పెంచిన వాణిజ్య గ్యాస్ ధరలు తగ్గించాలని సీపీఎం సామర్లకోట పట్టణ కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. ఈ ధర్నానుద్దేశించి సీపీఎం పట్టణ కార్యదర్శి బాలం శ్రీనివాస్ మాట్లాడుతూ వాణిజ్య గ్యాస్ సిలెండరు ధర మే 1 నుండి రూ.993 పెంచడం జరిగిందని, గత 3 నెలల కాలంలో 3 సార్లు పెంచారని, దీని వలన సిలెండరు రూ 3,071 అయ్యిందన్నారు. ఈ పెరుగుదల సామాన్య ప్రజానీకం తట్టుకోలేని విధంగా ఉందని చెప్పారు. టిఫిన్స్ రూ.20 రూ నుండి రూ. 30 రూపాయలు, భోజనం రూ. 100రూ నుండి రూ. 130 రూపాయలు పెరిగిందని, ప్రజానీకం జీతాలు వేతనాలు పెరగక అధిక ధరలు తట్టుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. పెరుగుదల వలన చిరు వ్యాపారాలు జీవనోపాధి దెబ్బ తింటుందన్నారు. అనేక చిరు వ్యాపారాలు మూత పడే పరిస్థితి వచ్చిందని చెప్పారు. రాష్ట్రము నుండి ప్రతి రోజు 21 వేల టన్నుల గ్యాస్ ఉత్పత్తి అవుతుందని, పైప్ లైన్ ద్వారా గుజరాత్, మహారాష్ట్ర తరలించి అంబాని విదేశాల్లో అమ్ముతున్నారని, రాష్ట్రానికి సగం వాటా ఇవ్వవలసి వున్నా ఇవ్వడం లేదన్నారు. అదే జరిగితే సిలెండరు రూ. 200 ఇవ్వవచ్చని చెప్పారు. అనంతరం తహశీల్దార్ కె చంద్రశేఖర రెడ్డికి వారు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం శాఖ కార్యదర్శి కరణం గోవిందరాజు, బాలం సత్తిబాబు, కొత్తూరి తులసిదాస్, దేశంశెట్టి నాగు, బాలం హరిబాబు, కరణం ఏడుకొండలు, తుంపాల శ్రీను, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# బండ్ల గణేష్ స్టైల్.. ఎంగేజ్మెంట్ గిఫ్ట్ చూసి షాక్.. ఖరీదు ఎంతంటే?





టాలీవుడ్ సెన్సేషనల్ ప్రొడ్యూసర్ బండ్ల గణేష్ ఇంట్లో ఇప్పుడు పెళ్లి సందడి అంబరాన్నంటుతోంది. ఆయన కుమార్తె జనని నిశ్చితార్థం రీసెంట్‌గా చాలా గ్రాండ్‌గా జరిగింది. అయితే ఈ వేడుకలో అందరినీ ఆశ్చర్యపరిచింది మాత్రం అతిథులకు ఇచ్చిన రిటర్న్ గిఫ్ట్స్. ఒక్కో గిఫ్ట్ విలువ వింటే సామాన్యులు షాక్ అవ్వాల్సిందే. ఎంగేజ్‌మెంట్‌కే ఈ రేంజ్‌లో ఉంటే, ఇక పెళ్లి ఏ స్థాయిలో ఉంటుందో అని నెటిజన్లు చర్చించుకుంటున్నారు. ఆ విశేషాలు చూద్దాం .. బండ్లన్న ఇంట్లో పెళ్లి బాజాలు: టాలీవుడ్‌లో తనదైన మాటలతో, సినిమాలతో ఎప్పుడూ వార్తల్లో ఉండే బండ్ల గణేష్ ఇప్పుడు తన కూతురి పెళ్లి పనుల్లో బిజీగా ఉన్నారు. జనని త్వరలోనే సూర్యతేజ అనే అబ్బాయితో ఏడడుగులు వేయబోతోంది. వీరి నిశ్చితార్థ వేడుక హైదరాబాద్‌లోని ఒక ప్రముఖ హోటల్‌లో చాలా వైభవంగా జరిగింది. సినీ రంగంతో పాటు రాజకీయ ప్రముఖులు, కూడా ఈ వేడుకకు తరలివచ్చారు. అతిథుల కోసం అదిరిపోయే గిఫ్ట్స్: సాధారణంగా పెళ్లిళ్లలో తాంబూలం లేదా చిన్న చిన్న బహుమతులు ఇస్తుంటారు. కానీ బండ్ల గణేష్ మాత్రం తన స్థాయికి తగ్గట్టుగా చాలా వెరైటీగా ఆలోచించారు. తన కూతురి ఎంగేజ్‌మెంట్‌కు వచ్చిన అతిథులకు ఎవరూ ఊహించని విధంగా ఖరీదైన 'రిటర్న్ గిఫ్ట్స్' ఇచ్చి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ గిఫ్ట్ బాక్స్‌కు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. 5 వేల రూపాయల బిర్యానీ హండీ: ఈ వేడుకకు వచ్చిన ప్రతి ఒక్కరికీ దాదాపు 5 వేల రూపాయల విలువ చేసే గిఫ్ట్ ప్యాక్ అందించారట. ఇందులో 'బర్గనర్' అనే ఆస్ట్రియన్ బ్రాండ్‌కు చెందిన ఒక నాణ్యమైన బిర్యానీ హండీ ఉంది. అది కూడా సుమారు 5 కిలోల సామర్థ్యం కలదని తెలుస్తోంది. దాంతో పాటు ఒక స్వీట్ బాక్స్, ఒక బ్లౌజ్ పీస్ కూడా ఆ గిఫ్ట్ బాక్స్‌లో పెట్టి అతిథులకు గౌరవంగా అందజేశారు. ప్రముఖుల సమక్షంలో వేడుక: ఈ వేడుకకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మెగా స్టార్ చిరంజీవి వంటి దిగ్గజాలు హాజరై కొత్త జంటను ఆశీర్వదించారు. ముఖ్యంగా బండ్ల గణేష్ రాజకీయంగా, సినీ పరంగా అందరితో మంచి సంబంధాలు కలిగి ఉండటంతో ఈ వేడుక చాలా సందడిగా సాగింది. ఇక వచ్చిన అతిథులను రిటర్న్ గిఫ్ట్‌తో బండ్లన్న సర్ప్రైజ్ చేయడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

అల్లుడు ఎవరో తెలుసా?: బండ్ల గణేష్ కాబోయే అల్లుడు సూర్యతేజ చిలుకూరి కుటుంబానికి పెద్ద ఎత్తున రియల్ ఎస్టేట్ వ్యాపారాలు ఉన్నాయని సమాచారం. అబ్బాయికి కూడా కోట్లలో ఆస్తులు ఉన్నట్లు తెలుస్తోంది. సూర్యతేజ ప్రస్తుతం ఏ రంగంలో ఉన్నారు అనే దానిపై ఇంకా పూర్తి వివరాలు తెలియనప్పటికీ, బండ్లన్న తన కూతురి కోసం ఒక గొప్ప సంబంధాన్ని వెతికి పట్టుకున్నారని ఫ్యాన్స్ అంటున్నారు. ఏది చేసినా 'రాయల్' గా చేయడమే బండ్ల గణేష్ స్టైల్ అని మరోసారి నిరూపితమైంది.

# నల్ల చీరలో పాయల్ హొయలు



సినీ పరిశ్రమలో ఎప్పుడూ లైమ్ లైట్‌లో ఎలా ఉండాలో.. ప్రేక్షకుల దృష్టిని ఎలా ఆకర్షించాలో పాయల్ రాజ్‌పుత్‌కు తెలిసినంతగా మరెవరికీ తెలియదేమో!. సోషల్ మీడియాలో నిరంతరం యాక్టివ్‌గా ఉండే ఈ భామ తాజాగా పోస్ట్ చేసిన ఫోటోలు ఇంటర్నెట్‌ను ఊపేస్తున్నాయి. బ్లాక్ అండ్ గోల్డ్ లైనింగ్ శారీలో పాయల్ మెరిసిపోతున్న తీరు నెటిజన్లను మంత్రముగ్ధులను చేస్తోంది. అందమైన ఎక్స్‌ప్రెషన్స్‌తో ఈ యంగ్ బ్యూటీ ప్రదర్శించిన హొయలు కుర్రకారును విపరీతంగా ఆకర్షిస్తున్నాయి. ఎంపిక చేసిన బ్లాక్ శారీపై గోల్డ్ షైన్ పాయల్ లుక్ ని ఎలివేట్ చేసిందనే ప్రశంసలు కురుస్తున్నాయి. ఈ డిజైనర్ శారీలో పంజాబీ సోయగం లుక్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. పాయల్ కేవలం గ్లామర్‌కే పరిమితం కాకుండా.. తన మనసులోని భావాలను కూడా అంతే నిజాయితీగా ఓపెనవుతుంది. ఇటీవల ఒక సినిమా ప్రమోషన్స్ సందర్భంగా తెలుగు మీడియా తన దివంగత తండ్రి గురించి అడిగిన ప్రశ్నకు తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ఆ సమయంలో కన్నీటి పర్యంతమై అక్కడి నుండి నిష్క్రమించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. పాయల్ ఎంత సెన్సిటివ్.. ఉద్వేగభరితమైన వ్యక్తి అనేదానికి ఈ ఘటన ఒక ఉదాహరణగా నిలిచింది. అయితే తన వృత్తిగత కట్టుబాట్లకు ప్రాధాన్యతనిస్తూ పాయల్ తన కెరీర్‌ను ముందుకు తీసుకెళ్తోంది. టాలీవుడ్‌లో ఎలాంటి గాడ్ ఫాదర్ లేకుండానే పాయల్ తన స్వయంకృషితో అవకాశాలను అందుకుంటోంది. అవకాశాలు ఉన్నా లేకపోయినా ఎప్పుడూ ఆశావహ దృక్పథంతో తనను తాను ఒక ఉత్తమ నటిగా మలుచుకునేందుకు నిరంతరం ప్రయత్నిస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. కెరీర్ విషయంలో ఎంతో ప్రయోగాత్మక ఆలోచనలతో ముందుకు సాగే పాయల్.... గ్లామర్ పాత్రలతో పాటు నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలను కూడా ఎంచుకుంటూ తనదైన ముద్ర వేస్తోంది. ప్రస్తుతం పాయల్ ధరించిన చీర కట్టుపై ఇంటర్నెట్‌లో జోరుగా చర్చ సాగుతోంది. ఇక పాయల్ రాజ్‌పుత్ నటిస్తున్న తదుపరి చిత్రాల విషయానికి వస్తే.. ఈ బ్యూటీ ప్రస్తుతం గోల్‌మాల్ ..కిరాతక వంటి ఆసక్తికరమైన ప్రాజెక్టులలో భాగమైంది. గోల్‌మాల్ చిత్రం ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. ఇది ఒక పూర్తి స్థాయి ఎంటర్‌టైనర్‌గా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. అలాగే కిరాతక సినిమా కూడా తన కెరీర్‌లో ఒక విభిన్నమైన చిత్రంగా నిలుస్తుందని సమాచారం. ఈ రెండు సినిమాలు 2026 ద్వితీయార్థంలో లేదా ఏడాది చివరలో విడుదలకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మొత్తానికి పాయల్ రాజ్‌పుత్ తన జీవితంలోని కీలకమైన వ్యక్తిగత, వృత్తిగత వ్యవహారాలను బ్యాలెన్స్ చేస్తూ నటిగా నిరూపించుకునే దిశగా దూసుకుపోతోంది.

ఓ పక్క తన తండ్రి జ్ఞాపకాలతో కూడిన ఉద్వేగం..మరోవైపు సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేసే ఫోటో షూట్‌లతో ఎప్పుడూ వార్తల్లో నిలుస్తోంది. విభిన్నమైన కథాంశాలతో రూపొందుతున్న తన తదుపరి సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయాన్ని అందుకుంటాయో చూడాలి.

# డైరెక్టర్ గా లావణ్య.. సతీ లీలావతిపై లావణ్య నెక్స్ట్ లెవెల్ కాన్ఫిడెన్స్!



టాలీవుడ్‌లో కంటెంట్‌తో పాటు క్లీన్ ఎంటర్‌టైన్‌మెంట్‌కు ప్రాధాన్యం పెరుగుతున్న ఈ సమయంలో, ప్రేక్షకులకు నవ్వులు పంచే మరో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా సతీ లీలావతి సిద్ధమవుతోంది. ఆనంది ఆర్ట్స్ సమర్పణలో దుర్గాదేవి పిక్చర్స్ బ్యానర్‌పై నాగమోహన్ నిర్మిస్తున్న ఈ సినిమాలో లావణ్య త్రిపాఠి కొణిదెల, దేవ్ మోహన్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. భీమిలీ కబడ్డీ జట్టు, ఎస్.ఎం.ఎస్ వంటి సినిమాలతో గుర్తింపు పొందిన తాతినేని సత్య దర్శకత్వంలో తెరకెక్కిన ఈ మూవీ మే 8న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. రిలీజ్‌కు ముందు చిత్ర బృందం ప్రమోషన్స్‌ను వేగవంతం చేయగా, హీరోయిన్ లావణ్య త్రిపాఠి మీడియాతో పలు ఆసక్తికర విషయాల్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడు తూ, సతీ లీలావతి చిత్రంపై తనకు పూర్తి నమ్మకం ఉందని తెలిపారు. ఇప్పటికే సినిమా చూసిన ఆమె, ఇది పూర్తిగా ఎంటర్‌టైనింగ్‌గా ఉండబోతోందని, ముఖ్యంగా కామెడీ ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటుందని చెప్పారు. షూటింగ్ సమయంలోనే తాను గర్భవతిని అని తెలిసిందని, అయినప్పటికీ టీమ్ సపోర్ట్‌తో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనిని పూర్తి చేసుకున్నానని వెల్లడించారు. ప్రతి రోజూ షూటింగ్ తర్వాత హాస్పిటల్‌కి వెళ్లి చెకప్ చేయించుకోవాల్సి వచ్చిందని, కొన్ని సీన్స్‌లో శారీరకంగా కష్టమైనా, పాత్ర కోసం ఎంతో కట్టుబాటుతో పనిచేశానని చెప్పారు. ఇకపై ఇలాంటి పరిస్థితుల్లో షూటింగ్‌లకు విరామం ఇవ్వాలని నిర్ణయించుకున్నానని కూడా పేర్కొన్నారు. ఈ సినిమాలో తాను డైరెక్టర్ పాత్రలో కనిపిస్తానని, కథలో వినోదం, భావోద్వేగాలు సమపాళ్లలో ఉంటాయని లావణ్య వివరించారు. మంచి మెసేజ్ ఉన్నప్పటికీ, అది ఎక్కడా క్లాస్ పీకుతున్నట్టు అనిపించదని, ప్రేక్షకులు సహజంగా కనెక్ట్ అయ్యేలా కథనం ఉంటుందని అన్నారు. తన మేనేజర్‌తో కలిసి సినిమా చూసేటప్పుడు అనేక సన్నివేశాల్లో నవ్వులు ఆపుకోలేకపోయామని చెప్పడం, సినిమాలోని కామెడీ లెవెల్‌ను సూచిస్తోంది. యాక్షన్ సీక్వెన్స్‌లలో కూడా తొలిసారి పాల్గొన్నానని, ముఖ్యంగా ఒక ఫైట్ సీన్‌లో కాస్త ఇబ్బంది అనిపించినా, ఆ అనుభవం కొత్తగా అనిపించిందని లావణ్య చెప్పారు. పర్సనల్ లైఫ్‌పై మాట్లాడిన లావణ్య, తాను ప్రస్తుతం భర్త వరుణ్‌తో పాటు కుటుంబంతో సంతోషంగా గడుపుతున్నానని తెలిపారు. సినిమా కథలో చూపిన రిలేషన్‌షిప్‌లకు రియల్ లైఫ్‌లో పోలికలు ఉండవని, అలాంటి పరిస్థితులు ఎవరికీ రాకూడదని అభిప్రాయపడ్డారు. తన కెరీర్ విషయంలో ప్రస్తుతం కొంత గ్యాప్ తీసుకుని, కుటుంబానికి సమయం కేటాయించాలని భావిస్తున్నానని వెల్లడించారు. అలాగే, ఫ్యూచర్‌లో వరుణ్‌తో కలిసి నటించే అవకాశం వస్తే తప్పకుండా ఆలోచిస్తానని చెప్పారు. సినిమా ప్రమోషన్స్‌కు సంబంధించి కూడా లావణ్య ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రామ్‌చరణ్ ట్రైలర్‌ను రిలీజ్ చేయడం ద్వారా సినిమాకు మంచి రీచ్ వచ్చిందని, ఆయనెప్పుడూ సపోర్టివ్‌గా ఉంటారని పేర్కొన్నారు. చిరంజీవి కూడా తమలాంటి కొత్త ప్రాజెక్ట్‌లను ఎంకరేజ్ చేస్తారని తెలిపారు. కో యాక్టర్ దేవ్ మోహన్ టాలెంట్ ను ప్రశంసించిన ఆమె, తాను కూడా ఈ సినిమాలో సొంతంగా డబ్బింగ్ చెప్పేందుకు ట్రై చేశానని చెప్పారు. మొత్తానికి సతీ లీలావతి సినిమా హాస్యంతో పాటు హృదయాన్ని తాకే అంశాలను మిళితం చేసిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. కమల్ హాసన్ క్లాసిక్‌తో పోల్చకూడదని స్పష్టం చేసిన లావణ్య, తమ సినిమా ప్రత్యేకమైన వినోదాన్ని అందిస్తుందని నమ్మకంగా చెబుతున్నారు. రిలీజ్‌కు ముందు నుంచే మంచి బజ్ సంపాదించిన ఈ సినిమా, బాక్సాఫీస్ వద్ద ఎలా మెప్పిస్తుందో చూడాలి.

# కొత్త జానర్‌లో నారా రోహిత్.. ఒక పోస్టర్‌తోనే హైప్




టాలీవుడ్‌లో కొత్త కాన్సెప్ట్‌లకు ప్రేక్షకుల నుండి వస్తున్న ఆదరణ మధ్య, యంగ్ హీరో రోహిత్ నారా తన కెరీర్‌ను మరింత వైవిధ్యంగా మలుచుకునే దిశగా ముందడుగు వేస్తున్నారు. రీసెంట్‌గా సుందరకాండ సినిమాతో వినోదభరితమైన ప్రదర్శన ఇచ్చిన ఆయన, ఇప్పుడు మరో ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. #RN23 అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా ద్వారా రోహిత్ కొత్త జానర్‌లో తన సామర్థ్యాన్ని చూపించాలనే ప్రయత్నం చేస్తున్నట్టు తెలుస్తోంది. ముఖ్యంగా, డెబ్యూ డైరెక్టర్ చినిమిల్లి మణికుమార్‌తో ఆయన కాంబినేషన్ కుదరడం ఈ ప్రాజెక్ట్‌కు స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలుస్తోంది. ఈ మూవీ అనౌన్స్‌మెంట్ పోస్టర్ రిలీజైన వెంటనే సోషల్ మీడియాలో చర్చకు దారి తీసింది. షౌటింగ్ సూన్ సరికొత్త ట్యాగ్‌లైన్‌తో వచ్చిన ఈ పోస్టర్, సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేసింది. సాధారణంగా టీజర్ లేదా ఫస్ట్ లుక్ ద్వారా హైప్ క్రియేట్ చేసే ట్రెండ్ మధ్య, కేవలం ఒక పోస్టర్ ద్వారానే ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించడం ఈ టీమ్ స్ట్రాటజీని ప్రత్యేకంగా నిలబెడుతోంది. పోస్టర్‌లో కనిపిస్తున్న కలర్ ఫుల్ డిజైన్ చూస్తుంటే ఇదొక ఫీల్ గుడ్ ఎంటర్టైనర్ అనే సిగ్నల్స్‌ను ఇస్తోంది. దీంతో, కథలో ఎమోషన్‌తో పాటు ఎంటర్టైన్‌మెంట్‌కు కూడా సమాన ప్రాధాన్యం ఉంటుందని అంచనాలు పెరుగుతున్నాయి. ఈ ప్రాజెక్ట్‌ను కరణ్ సి ప్రొడక్షన్స్ LLP బ్యానర్‌పై భరత్ చౌదరి నిర్మిస్తున్నారు. కొత్త డైరెక్టర్‌తో సినిమా చేయడం ఒక రిస్క్ అయినప్పటికీ, కంటెంట్‌పై నమ్మకంతోనే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. టాలీవుడ్‌లో రీసెంట్‌గా కొత్త దర్శకులు వినూత్న కథలతో మంచి విజయాలు సాధిస్తున్న నేపథ్యంలో, #RN23 కూడా ఆ జాబితాలో చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక రోహిత్ నారా కెరీర్ పరంగా చూస్తే, ఇదొక కీలక మలుపుగా మారవచ్చని సినీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. త్వరలోనే శుభ ముహూర్తంతో ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది. షూటింగ్ మొదలయ్యాక ఇతర నటీనటులు, టెక్నికల్ టీమ్ వివరాలను వెల్లడించనున్నట్లు సమాచారం. ప్రస్తుతం టైటిల్ కూడా ఫిక్స్ కాలేదు కాబట్టి, టీమ్ ప్లానింగ్ దశలోనే ప్రేక్షకుల్లో ఆసక్తి రేకెత్తించడం గమనార్హం. మొత్తానికి, #RN23 ఒక సాధారణ సినిమా ప్రకటనగా కాకుండా, కంటెంట్ ఆధారంగా హైప్ సృష్టించే కొత్త ట్రెండ్‌కు నాంది పలికే ప్రాజెక్ట్‌గా కనిపిస్తోంది. మరి ఈ సినిమాతో నారా రోహిత్ ఆడియన్స్‌ను ఏ మేర ఆకట్టుకుంటారో చూడాలి.

# దక్షిణ కోస్తా రైల్వే జోన్ రాష్ట్ర అభివృద్ధికి కీలక మలుపు : పట్టాభిరామ్





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన దక్షిణ కోస్తా రైల్వే జోన్ గెజిట్ (రాజ పత్రం)తో రైల్వే జోన్ ఏర్పాటు ప్రక్రియ పూర్తయిందని, ఇది రాష్ట్ర రాష్ట్రం మౌలిక సదుపాయాల అభివృద్ధిలో ఒక కీలక ముందడుగని విశాఖ పార్లమెంట్ టిడిపి అధ్యక్షుడు చోడే వెంకట పట్టాభిరాం హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల కేంద్రం రైల్వే జోన్ ఏర్పాటుకు అధికారిక గెజిట్ విడుదల చేసిన సందర్భంగా నగరంలోని రైల్వే స్టేషన్ ముందు పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు జరిగాయి. దీనిలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విశాఖ రైల్వే జోన్ ఏర్పాటువల్ల రైల్వే లలో రాష్ట్రం మంచి అభివృద్ధి సాధిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ గణబాబు మాట్లాడుతూ జోన్ ఏర్పాటుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడంతో ఎన్డీఏ ప్రభుత్వ చిత్తశుద్ధి వెల్లడైందన్నారు. రైల్వే జోన్ కోసం అహర్నిశలు కృషి చేసిన విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్‌కి ధన్యవాదాలు తెలుపుతున్నా మన్నారు. విశాఖ రైల్వే స్టేషన్ ప్రధాన ద్వారం ముందు ఆయన చిత్రపటాలతో వున్న ప్లకార్డులను ప్రదర్శించారు. టిడిపి కార్యకర్తలు బాణాసంచా పేల్చి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టిడిపి అధ్యక్షుడు చోడే పట్టాభిరామ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు పాల్గొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను అభినందించారు. నాయకులు మాట్లాడుతూ 40 ఏళ్ల నాటి కల నేటితో సాకారమైందన్నారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు ద్వారా రాష్ట్రంలో మౌలిక వసతుల అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నం నెరవేరేందుకు తీవ్రంగా కృషి చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, విశాఖ ఎంపీ శ్రీభరత్‌లకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ మరియు ప్రధాని నరేంద్ర మోదీని పలుమార్లు కలిసి జోన్ అవసరాన్ని వివరించి ఒప్పించారని చెప్పారు. రైల్వే జోన్ సాధన సమితి కన్వీనర్ చలసాని గాంధీ మాట్లాడుతూ, “రైల్వే జోన్ సాధన కోసం సంవత్సరాల పాటు జరిగిన పోరాటానికి ఫలితం లభించిందన్నారు. విభజన హామీల్లో ఒకటైన ఈ డిమాండ్ నెరవేరడం రాష్ట్ర భవిష్యత్తుకు కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ దక్షిణ నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి సీతం రాజు సుధాకర్, ప్రధాన కార్యదర్శి లోడగల కృష్ణ, విల్లూరు భాస్కరరావు, బైరెడ్డి పోతన రెడ్డి, ఉమ్మి అప్పారావు, ఈతలపాక సుజాత, ఐతి. మధుబాబు, ఐతి. రవి, కోట నరేష్, బుచ్చా రామిరెడ్డి, కింగ్, కేదార్ లక్ష్మి, బొడ్డేటి మోహన్, గొప్ప ధర్మారావు, కుట్ట కార్తిక్ బత్తిన నవీన్, నెక్కెళ్ళ సత్తిబాబు, గొర్లె నాగమణి, వరలక్ష్మి తోట శ్రీదేవి, ఉసిరికాయ విల్లేశ్వరి, రవిశం కర్, సౌజన్య, జయశ్రీ, టిడిపి అనుబంధ సంఘాల నాయకులు, మహిళలు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఆర్యవైశ్యుల అభ్యున్నతే లక్ష్యంగా వాసవి ఫౌండేషన్



**విజయనగరం, (రాజధాని వార్తలు):** ఆర్యవైశ్యుల అభ్యున్నతే లక్ష్యంగా అంతర్జాతీయ స్థాయిలో వాసవి ఫౌండేషన్ సేవలందిస్తుందని సంఘం విజయనగరం జిల్లా శాఖ అధ్యక్షులు మండవిల్లి వెంకట రాజు పేర్కొన్నారు. మంగళవారం విజయనగరం జిల్లాలో ఒక ప్రైవేట్ అత్యధిక గృహంలో జరిగిన కార్యక్రమంలో సముద్రాల గురు ప్రసాద్ గిరిజా ప్రసన్న దంపతులను ఘనంగా సత్కరించారు. సాహిత్య, సేవ, ఉపాధ్యాయ రంగాలలో అందిస్తున్న సేవలను గుర్తించి వారిని చూసి ఇతరులు స్ఫూర్తి పొందాలని వాసవి ఫౌండేషన్ విజయనగరం జిల్లా శాఖ అధ్యక్షులు మండ విల్లి వెంకటరాజు పేర్కొన్నారు. పాఠశాల కళాశాల స్థాయి విద్యార్థులకు ప్రోత్సహిస్తూ తెలుగు భాష పరిరక్షణ పట్ల, పుస్తక పఠనం పట్ల అవగాహన కలిగిస్తూ తెలుగు స్వర్ణ నంది పురస్కారం, తెలుగు కీర్తి పురస్కారం స్వీకరించి ఆదర్శప్రాయంగా నిలిచారని అన్నారు. ఈ సమావేశంలో ప్రాజెక్టు చైర్మన్‌లు మండవల్లి సత్యనారాయణ, చెన్నా బుచ్చి జనార్ధన్‌రావు, కలగర్ల నారాయణ రావు, సలహాదారులు రవ్వ వెంకటేశ్వరరావు, పులిపాటి వెంకట రామారావు, తదితరులు పాల్గొన్నారు.

# మెడికవర్ హాస్పిటల్ మరో విజయం

## - విజయవంతంగా అరుదైన గొంతు శస్త్ర చికిత్స

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** మెడికవర్ ఈఎన్‌టీ విభాగం వైద్యులు మరో అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించి వైద్య రంగంలో తమ ప్రతిభను చాటుకున్నారు. కాకినాడ జిల్లాకు చెందిన ఎం.దుర్గ అనే మహిళ గొంతుకు సంబంధించిన క్లిష్ట సమస్యతో బాధపడుతుండగా కాకినాడ మెడికవర్ హాస్పిటల్స్, వైద్యురాలు డా.నికిత రెడ్డి అత్యాధునిక పద్ధతులతో చికిత్స అందించి ఆరోగ్యవంతురాలిగా తీర్చిదిద్దారు. ఈ విజయంపై ఆసుపత్రిలో ఈఎన్‌టీ సర్జన్ డాక్టర్ నిఖిత రెడ్డి మాట్లాడుతూ, “మహిళ గొంతులో ఏర్పడిన అరుదైన కణితి కారణంగా శ్వాస తీసుకోవడంలో, ఆహారం మింగడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కేసు పూర్తి పరిశీలన అనంతరం, శస్త్ర చికిత్సే ఉత్తమ మార్గమని నిర్ణయించి, మా నిపుణుల బృందంతో కలిసి విజయవంతంగా ఆపరేషన్ నిర్వహించామన్నారు. ప్రస్తుతం రోగి ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని ఆమె తెలిపారు. ఇటువంటి సమస్యలను ప్రారంభ దశలో గుర్తిస్తే చికిత్స సులభమవుతుందని, గొంతు సంబంధిత ఇబ్బందులు, శ్వాసలో ఇబ్బంది, దీర్ఘకాలిక



గొంతు నొప్పి వంటి లక్షణాలు కనిపించినప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించాలని ఆమె సూచించారు. మెడికవర్ హాస్పిటల్స్ సెంటర్ హెడ్ ఎన్ అంజిబాబు మాట్లాడుతూ, “మా ఆసుపత్రిలో అత్యాధునిక సదుపాయాలు, అనుభవజ్ఞులైన వైద్య బృందం ఉండటం వల్ల క్లిష్టమైన శస్త్రచికిత్సలను కూడా విజయవం తంగా నిర్వహిస్తున్నామన్నారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలను అందించడం మా ప్రధాన లక్ష్యం” అని ఆయన తెలిపారు. ఈ విజయవంతమైన శస్త్రచికిత్సతో మెడికవర్ హాస్పిటల్స్ మరోసారి తన విశ్వసనీయతను నిరూపించుకుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి యజమాన్యం, వైద్యులు పాల్గొన్నారు.

# పెనుగుదురు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థుల అద్భుత ప్రతిభ

## - తొలి ఏడాదిలోనే 88 శాతం ఉత్తీర్ణత




**కరప, (రాజధాని వార్తలు):** కరప మండలం, పెనుగుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో పదో తరగతి ప్రారంభించిన తొలి ఏడాదిలోనే విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. మొత్తం 12 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 10 మంది ఉత్తీర్ణత సాధిం చారు. దీంతో పాఠశాల 88 శాతం ఫలితాలను నమోదు చేసింది. ఉత్తీర్ణులైన విద్యార్థుల్లో 9 మంది ప్రథమ శ్రేణిలో, ఒకరు ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించడం విశేషం. ఐదుగురు విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించి పాఠశాల ప్రతిష్టను మరింత పెంచారు. అత్యధికంగా 573 మార్కులు సాధించిన అమ్మిన మేఘన పాఠశాలలో ప్రథమ స్థానం పొందారు. 515 మార్కులతో గుబ్బల మధు వెంకటసాయి ద్వితీయ స్థానం, 511 మార్కులతో అనుసూరి సంధ్య తృతీయ స్థానం సాధించారు. ఈ ముగ్గురు విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలతో పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. మంగళవారం పాఠశాలలో నిర్వహించిన సత్కార కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షుడు బండారు మురళి, మాజీ ఎంపీటీసీ తుమ్మలపల్లి మాచరరావు, నీటి సంఘ అధ్యక్షులు తుమ్మలపల్లి గోవిందు, జనసేన గ్రామ అధ్యక్షుడు గంటా నాని బాబు, మండల విద్యాధికారులు కే.బుల్లి కృష్ణవేణి, పి.సత్యనారాయణ పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు తుమ్మలపల్లి వెంకటరత్నం ట్రస్ట్ తరపున మెమెంటోలు అందజేసి దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ తరపున ప్రథమ స్థానం పొందిన అమ్మిన మేఘనకు రూ.3,000 నగదు బహుమతి, ద్వితీయ స్థానం సాధించిన గుబ్బల మధు వెంకట సాయికి రూ.2000, తృతీయ స్థానం పొందిన అనుసూరి సంధ్యకు రూ.1,500 నగదు, 500 మార్కులు సాధించిన విద్యార్థులకు రూ 1000 నగదు బహుమతులను తుమ్మలపల్లి మాచరరావు అందజేశారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి మాచరరావు మాట్లాడుతూ తాను ఈ పాఠశాల పూర్వ విద్యా ర్థినని, స్కూల్ గ్రౌండ్ కోసం 50 సెంట్ల భూమిని తమ కుటుంబం అందించిందని తెలిపారు. ట్రస్ట్ ద్వారా ప్రతి సంవత్సరం పాఠశాలకు సహాయం చేస్తానని, ఇంటర్మీడియట్‌లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేస్తా నని హామీ ఇచ్చారు.

బండారు మురళి మాట్లాడుతూ పెనుగుదురు గ్రామంలో టెన్త్ క్లాస్ వరకు పాఠశాలను అభివృద్ధి చేయడంలో రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, ఎంఈఓల సహకారం కీలకమని తెలిపారు. విద్యార్థులు తమ పాఠశాలకు, ఉపాధ్యా యులకు, తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకు రావాలని, భవిష్యత్తులో ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నత స్థానాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ తుమ్మల పల్లి చంద్రమౌళి, వైస్ చైర్మన్ చింతాకుల లోవకుమారి, దేవు శ్రీను, గుబ్బల భవాని సత్తిబాబు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొని ప్రతిభావంతులైన విద్యార్థులను అభినందించారు.

# దళిత క్రైస్తవులను ఎస్సీలుగానే గుర్తించాలి

## - దళిత క్రైస్తవుల శాంతియుత ర్యాలీ - మతం మారినంత మాత్రాన కుల వివక్ష పోతుందా - చర్చిలపై, మైనారిటీలపై దాడులు అరికట్టాలి




**అమలాపురం, (రాజధాని వార్తలు):** దళిత క్రైస్తవులకు ఎస్.సి హోదా కల్పించాలనే డిమాండ్‌తో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో జిల్లా పాస్టర్ల జేఏసీ ఆధ్వర్యంలో భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన దళిత క్రైస్తవులు ర్యాలీలో పాల్గొని తమ హక్కుల కోసం గళమెత్తారు. పాస్టర్ల జేఏసీ జిల్లా అధ్యక్షుడు విప్పర్తి రాజకుమార్, తాతపూడి ఎర్నెస్ట్, యెహోషువ ఆధ్వర్యంలో అమలాపురం పట్టణంలోని గడియారం స్తంభం సెంటర్ వద్ద ప్రారంభమైన ర్యాలీ, ముమ్మిడివరం గేట్, నల్లవంతెన మీదుగా ఎర్ర వంతెన సమీపంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వరకు సాగింది. “మతం మారితే కులం మారదు” “దళిత క్రైస్తవులకు న్యాయం చేయాలి” దళిత క్రైస్తవులకు శాపంగా మారిన రాజ్యాంగంలోని నిబంధనలు తొలగించాలి అంటూ తమ నిరసన వ్యక్తం చేశారు.ర్యాలీ అనంతరం స్థానిక శాసనసభ్యుడు అయితాబత్తుల ఆనందరావు క్యాంపు కార్యాలయం వద్దకు చేరుకుని తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా ఛైర్మన్ ఆల్లాడ స్వామినాయుడు (సోంబాబు)లకు వినతి పత్రం సమర్పించారు. మతం ఆధారంగా ఎస్.సి హోదాను పరిమితం చేయడం అన్యాయమని అన్నారు. మతం మార్చుకున్నప్పటికీ సామాజిక, ఆర్థికంగా వెనుకబడిన స్థితి మారదని అందువల్ల దళిత క్రైస్తవులను ఎస్.సిలుగానే గుర్తించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే రంగనాథ్ మిశ్రా కమిషన్, సచార్ కమిటీలు దళిత క్రైస్తవులకు ఎస్.సి హోదా ఇవ్వాలని సిఫార్సు చేసిన విషయాన్ని వారు గుర్తు చేశారు.

ఆ సిఫార్సులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ ర్యాలీలో జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో దళిత క్రైస్తవులు, సంఘాల నాయకులు, యువత, మహిళలు పాల్గొని నిరసన వ్యక్తం చేశారు.

# జిల్లా ఎస్పీని కలిసిన డీఎస్పీ తిలక్



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం డిఎస్పి ఏ బాల గంగాధర తిలక్ మంగళవారం కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. పెద్దాపురం డిఎస్పీగా సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించిన డిఎస్పి మంగళవారం కాకినాడలోని ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ బిందు మాధవ్‌ను కలిసి పరిచయం చేసుకున్నారు. పెద్దాపురం డీఎస్పీ కార్యాలయంలో ఆయన విధులకు హాజరయ్యారు.

# గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీల నియామకం తగదు

## - అజారుద్దీన్, కోదండరాం నియామకాలపై పిటిషన్



**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** గవర్నర్ కోటాలో మహమ్మద్ అజారుద్దీన్, ప్రొఫెసర్ ఎం.కోదండరాంను ఎమ్మెల్సీలుగా నియమించడాన్ని వ్యతిరేకిస్తూ హైకోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. వారిద్దరినీ ఎమ్మెల్సీగా నియమిస్తూ జారీ చేసిన జీవో 71 కు చట్టబద్ధత లేదంటూ షియా సివిల్ కౌన్సిల్ ఫర్ సోషల్ జస్?సకు చెందిన సయ్యద్ హైదర్ రజా నఖ్వీ హైకోర్టును ఆశ్రయించారు. కళలు, సాహిత్యం, సామాజిక సేవ వంటి రంగాల్లో విశేష కృషి చేసిన వారిని మాత్రమే గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నామినేట్ చేయాల్సి ఉండగా.. అజారుద్దీన్, కోదండరాంల నియామకం ఇందుకు విరుద్ధంగా జరిగిందని పిటిషనర్ పేర్కొన్నారు. అభ్యర్థులపై పెండింగ్‌లో ఉన్న కేసులు, చట్టపరమైన ఇతర అడ్డంకులను రాష్ట్ర ప్రభుత్వం సరిగా పరిశీలించలేదని పిటిషనర్ ఆరోపించారు. సామాజిక సేవకులను కాకుండా రాజకీయ నాయకులను ఎమ్మెల్సీలుగా నియమించారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో జీవో 71పై తక్షణం స్టే విధించడంతోపాటు రిట్ పిటిషన్‌లో తుది తీర్పు ఇచ్చే వరకు నామినీలు ప్రమాణ స్వీకారం చేయకుండా అడ్డుకోవాలని పిటిషనర్ కోరారు.

# పక్షుల అద్భుత లోకం: ఈ వేసవిలో మధ్యప్రదేశ్ రెక్కల అద్భుతాలతో కళకళలాడుతుంది







మధ్యప్రదేశ్ అనగానే దట్టమైన అడవులు, గర్జించే పులుల చిత్రాలు వెంటనే మనసులో మెదులుతాయి. కానీ ఈ పులుల రాష్ట్రపు సరిహద్దులకు ఆవల మరో ఉత్సాహభరితమైన ప్రపంచం ఉంది– అది రంగులు, ఈకలు, ఎగిరే రెక్కలు, మధురమైన పక్షుల కిలకిలారావాలతో నిండి, ప్రకృతితో ప్రశాంతతను, అనుబంధాన్ని అందిస్తుంది. తన సరస్సులు, చిత్తడి నేలలు, అడవుల అంతటా, మధ్యప్రదేశ్ వేసవి ప్రయాణాలను ప్రశాంతమైన పక్షుల వీక్షణ అనుభవంగా మారుస్తోంది. 450కి పైగా పక్షి జాతులు నమోదు కావడంతో, ఈ రాష్ట్రం భారతదేశంలోని అత్యంత ఉత్తేజకరమైన పక్షుల వీక్షణ గమ్యస్థానాలలో ఒకటిగా వేగంగా ఎదుగుతోంది. సెంట్రల్ ఏషియన్ ఫ్లైవే మార్గంలో ఉన్న మధ్యప్రదేశ్, ప్రతి శీతాకాలంలో సైబీరియా, మధ్య ఆసియా, ఐరోపా నుండి వేలాది వలస పక్షులకు స్వాగతం పలుకుతుంది. ఈ రెక్కల అతిథులు రాష్ట్రంలోని చిత్తడి నేలలు, జలాశయాలలో విశ్రాంతి తీసుకోవడానికి వేలాది కిలోమీటర్లు ప్రయాణిస్తాయి. వేసవి సమీపిస్తుండగా, అనేక వలస పక్షులు తమ తిరుగు ప్రయాణాన్ని ప్రారంభిస్తాయి, అదే సమయంలో స్థానిక పక్షి జాతులు అత్యంత చురుకుగా మారతాయి–ఇది పక్షి ప్రేమికులకు పూర్తిగా భిన్నమైన మరియు అంతే అద్భుతమైన అనుభవాన్ని అందిస్తుంది. వేసవి కాలంలో, పక్షి ప్రేమికులు ఇండియన్ ప్యారడైజ్ ఫ్లైక్యాచర్, క్రెస్టెడ్ సర్పెంట్ ఈగిల్, పైడ్ కింగ్‌ఫిషర్, రివర్ టెర్న్ మరియు మలబార్ పైడ్ హార్న్‌బిల్ వంటి అద్భుతమైన జాతులను సులభంగా గుర్తించగలరు. పక్షుల గూళ్ళు కట్టడం, సంతానోత్పత్తి ప్రవర్తన మరియు వాటి సహజ జీవన లయలను దగ్గరగా గమనించడానికి ఈ కాలం అనువైనదిగా పరిగణించబడుతుంది. మధ్యప్రదేశ్‌లో పక్షులను చూడటం అంటే కేవలం పక్షులను గుర్తించడం మాత్రమే కాదు–అది ప్రకృతిలో లీనమవడం. అటావి





బర్డ్ ఫౌండేషన్ వంటి సంస్థలు, గైడెడ్ బర్డ్ వాక్స్ మరియు అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రజలను పరిరక్షణ మరియు పౌర విజ్ఞానంతో అనుసంధానిస్తున్నాయి. బైనాక్యులర్ల జతతో ప్రకృతిని అనుభవించాలనుకునే ఎవరికైనా, మధ్యప్రదేశ్ తన చిత్తడి నేలలు, అడవులు మరియు సరస్సులలో దాగి ఉన్న లెక్కలేనన్ని కథలను అందిస్తుంది.

భోపాల్: సరస్సుల నగరం

భోజ్ వెట్‌ల్యాండ్ (అప్పర్ లేక్), వాన్ విహార్, కెర్వా మరియు కలియాసోట్ కలిసి ఒక అభివృద్ధి చెందుతున్న పట్టణ పక్షి వీక్షణ క్షేత్రాన్ని సృష్టిస్తాయి. ఇక్కడ నగరం యొక్క సహజ పరిసరాల మధ్య బార్–హెడెడ్ గీస్, ఇండియన్ ప్యారడైజ్ ఫ్లైక్యాచర్స్, బ్రౌన్ ఫిష్ అవుల్స్ మరియు రివర్ టెర్న్‌లను చూడవచ్చు.

జబల్‌పూర్: రాతి అరణ్యం & అటవీ పక్షి వీక్షణం

డుమ్నా నేచర్ పార్క్ మరియు నర్రాయ్ అడవులు పక్షి వీక్షకులకు ఒక స్వర్గం. ఇక్కడ రాకెట్–టెయిల్డ్ డ్రోంగో, ఈజిప్షియన్ వల్చర్ మరియు ఇండియన్ రోలర్ వంటి పక్షులను చూడవచ్చు.

ఇండోర్: చిత్తడి నేలలు & పక్షుల సౌందర్యం

గులావత్‌లోని లోటస్ వ్యాలీ మరియు తలవాలి చందా, పైడ్ కింగ్‌ఫిషర్, వూలీ–నెక్డ్ స్టోర్క్ మరియు రెడ్ అవడావత్ వంటి రంగురంగుల జాతులతో కళకళలాడుతుంటాయి. అదే సమయంలో, సిర్‌పూర్ సరస్సు (ఒక రామ్‌సర్ సైట్) మరియు యశ్వంత్ సాగర్, సైబీరియా, రష్యా, మంగోలియా మరియు మధ్య ఆసియా నుండి వచ్చే వేలాది వలస పక్షులకు ముఖ్యమైన ఆవాసాలుగా పనిచేస్తున్నాయి.

నార్సింగ్‌గఢ్ & ఖేయోని: దాగి వున్న పక్షి వీక్షణ ప్రదేశాలు

దట్టమైన అడవులతో నిండి, పర్యాటకుల రద్దీ తక్కువగా ఉండే ఈ ప్రశాంతమైన అభయారణ్యాలు, వూలీ–నెక్డ్ స్టోర్క్, బ్లాక్–వింగ్డ్ కైట్ మరియు యూరేషియన్ హూపో వంటి జాతులకు ప్రసిద్ధి చెందాయి.

సత్పురా & పన్నా: వన్యప్రాంతాలు

సత్పురాలోని వాకింగ్ సఫారీలు మరియు పన్నా జాతీయ ఉద్యానవనంలోని అద్భుతమైన నదీతీరాలు మరపురాని పక్షి వీక్షణ అనుభవాలను అందిస్తాయి. వీటిలో మలబార్ పైడ్ హార్న్‌బిల్, ఇండియన్ స్కిమ్మర్ వంటి పక్షులను చూడటంతో పాటు, కెన్ నది కొండల వెంబడి గూళ్ళు కట్టుకునే రాబందులను కూడా చూడవచ్చు.

గ్వాలియర్: క్యాంపస్ బర్డింగ్

జీవాజీ విశ్వవిద్యాలయం యొక్క పచ్చని ప్రాంగణం, పర్పుల్ సన్‌బర్డ్ మరియు ఏషియన్ ప్యారడైజ్ ఫ్లైక్యాచర్ వంటి జాతులకు సురక్షితమైన ఆశ్రయంగా మారింది. అటావి బర్డ్ ఫౌండేషన్, మధ్యప్రదేశ్ టూరిజం బోర్డ్ సహకారంతో, స్థానిక నివాసితులకు బర్డ్ గైడ్‌లుగా మరియు ప్రకృతి శాస్త్రవేత్తలుగా శిక్షణ ఇవ్వడం ద్వారా స్థానిక సమాజాలను శక్తివంతం చేస్తూ, పరిరక్షణ మరియు బాధ్యతాయుత పర్యాటకం రెండింటినీ ప్రోత్సహిస్తోంది. బర్డ్ వాక్స్‌లో చేరడానికి ఆసక్తి ఉన్నవారు వీరిదీ వెబ్‌సైట్ మరియు సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో నమోదు వివరాలను కనుగొనవచ్చు. ఈ వేసవిలో, విభిన్నమైనదాన్ని ఎంచుకోండి–రద్దీగా ఉండే హిల్ స్టేషన్‌లకు దూరంగా అడుగుపెట్టి, పక్షుల కిలకిలరావాలు మరియు ప్రకృతితో ప్రశాంతమైన ఉదయాలను గడపండి. మధ్యప్రదేశ్‌కు రండి, ప్రకృతి రెక్కలతో విహరించండి–ఇక్కడ ప్రతి పక్షి కిలకిలారావం ఒక కథను చెబుతుంది.

# మదర్స్ డే సందర్భంగా కేపీహెచ్‌బీలో ఉచిత వైద్య శిబిరం






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు రూరల్ కేపీహెచ్‌బీ కాలనీలో మాతృ దినోత్సవం సందర్భంగా భారీ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బ్రహ్మాస్ ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్, కేపీహెచ్‌బీ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ మెడికల్ క్యాంప్‌లో ప్రముఖ వైద్యులు పాల్గొని వృద్ధులకు, పేదలకు ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. ఉచిత మందులతో పాటు ఎముకల సాంద్రత పరీక్షలు కూడా నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మదర్స్ డే సందర్భంగా ప్రజలకు, ముఖ్యంగా వృద్ధులకు మరియు పేదలకు ఆరోగ్య సేవలు చేరువ చేయాలనే సత్సంకల్పంతో నెల్లూరు కేపీహెచ్‌బీ కాలనీలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. బ్రహ్మాస్ చారిటబుల్ ట్రస్ట్ మరియు కేపీహెచ్‌బీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సామాజిక సేవా కార్యక్రమంలో అపోలో ఆసుపత్రికి చెందిన జనరల్ ఫిజీషియన్ డాక్టర్ దివాకర్ రెడ్డి, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ మౌనిక పాల్గొని రోగులకు విశేష సేవలు అందించారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్థోపెడిక్ డాక్టర్ టి.మౌనిక, జనరల్ ఫిజీషియన్ పివి దివాకర్ రెడ్డి, ప్రభాస్ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గాలాజు నాగమణి. ఖూఎదీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ప్రతాప్, సెక్రెటరీ నాగభూషణం, లేడీస్ సెక్రెటరీ లలితా భాయి చక్ర, జాయింట్ సెక్రెటరీ హరిహర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# పంచారామంలో యనమల ప్రత్యేక పూజలు

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** పంచారామ క్షేత్రం సామర్లకోట శ్రీ కుమార రామ భీమేశ్వర స్వామి ఆలయంలో మాజీ శాసన మండలి సభ్యులు యనమల రామకృష్ణుడు ప్రత్యేక పూజలు చేపట్టారు. శనివారం ఆలయానికి చేరుకున్న రామకృ ష్ణుడు భీమేశ్వర స్వామిని, బాలా త్రిపుర సుందరి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి నంది మండపం ఆలయ అర్చకులు, వేద పండితులు వారికి ఆశీర్వచనం అందజేశారు. అనంతరం ఆలయ అధికారి బళ్ల నీలకంఠం వారికి స్వామి వారి ప్రసాదము, ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కంటే జగదీష్ మోహన్ స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు చీమలకొండ వీరభద్ర ప్రసాదరావు, తాతపూడి సత్య అరుణ్ వంశీ, గొల్తి సత్యనారాయణ, తాతపూడి పవన్ కుమార్, అలోక్ చంద్ర



జైన్, కంచర్ల సుష్మ మోహిని, కొండపల్లి సత్యవాణి, మందపల్లి భాను వెంకట పద్మ, బాడితిమాని లక్ష్మి, గోనిపాటి బుల్లమ్మ, కూటమి నాయకులు దేవస్థానం అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వైసిపి హయాంలో ట్రూ ఆఫ్ కూటమి హయాంలో ట్రూ డౌన్

## - మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్




**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో విద్యుత్ చార్జీలు భవిష్యత్తులో పెంచబోమని, ఇచ్చిన హామీ ప్రకారం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ట్రూ ఆఫ్ చార్జీలు పెంచకుండా, జగన్ రెడ్డి వైసీపీ పాలనలో తొమ్మిది సార్లు పెంచిన విద్యుత్ చార్జీలు 72 వేల కోట్ల రూపాయలు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ట్రూ డౌన్ పేరుతో విద్యుత్ చార్జీలను తగ్గించడం వల్ల వినియోగదారుల్లో ఆనందం వ్యక్తపరుస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావు తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకున్న చర్యలను కొనియాడారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే విద్యుత్ చార్జీలను ప్రతినెల ప్రభుత్వం సబ్సిడీతో పాటు జగన్ రెడ్డి పెంచిన చార్జీలను తగ్గిస్తూ రావడం వల్ల ఈరోజున యూనిట్‌కి 13 పైసలు తగ్గించడం వల్ల వినియోగదారులకు ప్రతినెలా వచ్చే 800 బిల్లు ఇప్పుడు 400 వస్తుందని మా కార్యకర్తలు ఇంటింటి సర్వే చేయడంతో విద్యుత్ వినియోగదారులు బహిరంగంగా మా విద్యుత్ బిల్లు గతంలో కంటే చాలా తక్కువ వస్తుందని ఆనందాన్ని వ్యక్తపరుస్తున్నారని నాగ జగదీష్ అన్నారు. విద్యుత్ రంగాన్ని గాడిని పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్నా చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయని, గత వైసీపీ ప్రభుత్వంలో అడ్డగోలుగా చేసిన విద్యుత్ కొనుగోలులో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కట్టడి చేసిందని, ఫలితంగా వైసిపి హయాంలో సగటున యూనిట్ ధర 5.45 పైసాల వరకు ఉండగా దాన్ని రూ.4.90 కి తగ్గించ గలిగారని, ఒక యూనిట్ పై 55 పైసలు వరకు మిగలడంతో ఏడాదిలో సుమారు రూ.4,398 కోట్లు ఆదా చేయ గలిగారని, దీని మూలంగా ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులకు ట్రూ డౌన్‌తో యూనిట్‌కి 13 పైసలు చొప్పున తగ్గించడంతో విద్యుత్తు వినియోగించే వినియోగదారులకు ఉపశమనం కలిగిందని నాగ జగదీష్ అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ భోగలింగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ రాష్ట్ర విశ్రాంతి ఉద్యోగుల రాష్ట్ర కార్యదర్శి బుద్ధ కాశీ విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి గడపకు పూసిన పసుపు పారాణి అమ్మ



**విజయనగరం, (రాజధాని వార్తలు):** తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షులు సముద్రాల గురుప్రసాద్ ఆధ్వర్యంలో గీతాంజలి పాఠశాలలో అంతర్జాతీయ మాతృదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పలువురు మాతృమూర్తులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గురు ప్రసాద్ మాట్లాడుతూ గాయత్రిని మించిన మంత్రం లేదని, తల్లిని మించిన దైవం లేదని ఇంటి గడపకు పూసిన పవిత్ర పసుపు పారాణి వంటిది అమ్మ అని అభివర్ణించారు. కార్యక్రమాన్ని ప్రముఖ వస్త్ర వ్యాపారవేత్త పులిపాటి రామారావు జ్యోతి ప్రజ్వలనం చేసి ప్రారంభించగా, రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్వప్న హైందవి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ అమ్మ అంటే దైవ సమానమని, అమ్మ ప్రేమకు ప్రత్యామ్నాయం లేదని అన్నారు. ప్రముఖ న్యాయవాది నాలుగెస్సులరాజు, ఫూల్ బాగ్ జిల్లా పరిషత్ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయులు దశగ్రంథాల వెంకట సుబ్రహ్మణ్యం ప్రధాన వక్తలుగా హాజరై మాతృమర్తి ప్రాధాన్యతను వివరించారు. ఈ సమావేశంలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బోండా రమేష్, ఉత్తరాంధ్ర మహిళా విభాగం అధ్యక్షురాలు పలుకూరి ప్రభావతి, జిల్లాశాఖ మహిళా విభాగం అధ్యక్షురాలు గిరిజా ప్రసన్న, వాకర్స్ క్లబ్ డిప్యూటీ గవర్నర్ ముళ్లపూడి సుభద్రాదేవి, శ్రీ వాసవీ ఆర్యవైశ్య సేవాసంఘం కంటోన్మెంట్ శాఖ అధ్యక్ష కార్యదర్శులు డిమ్సరాజు, బత్తుల కామేష్, కోశాధికారి ముత్తా మల్లికార్జునరావు, విశ్వసాహితీవేదిక అధ్యక్షురాలు భోగరాజు సూర్యలక్ష్మి, న్యాయవాది దాసరి పద్మ, పాఠశాల కరస్పాండెంట్ ఎ శ్రీనివాసరావు, డైరక్టర్ రాజేష్, ప్రిన్సిపాల్ మల్లిక, తదితరులు పాల్గొన్నారు.

**RAJADHANI CLASSIFIEDS Ad. Call**
**9440662699, rajadhanivartalu.com**

**EDUCATIONAL**

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

**HOSPITALS**

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

**MATRIMONIAL**

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబంధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

**REAL ESTATE**

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

**NGO's**

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

**RESTAURENTS**

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

**COMPANIES**

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎక్స్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిన్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, టి నూతక్కి ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699

# ఆపరేషన్ సింధూర్ : భారతదేశ వ్యూహాత్మక వైఖరిని పునర్నిర్వచించిన సంకల్పం

‘ఆపరేషన్ సింధూర్’ వార్షికోత్సవం గుర్తుంచుకోవాల్సిన తేదీ మాత్రమే కాదు; భారత వ్యూహాత్మక దృక్పథంలో వచ్చిన బలమైన, నిర్ణయాత్మకమైన మార్పుకు ప్రతిబింబం. 2026, మే 7న జరిగిన సంఘటనలు కేవలం విజయవంతమైన ఒక సైనిక చర్య మాత్రమే కాదు. అవి రాజకీయ సంకల్పం, సైనిక సన్నద్ధత, సాంకేతిక సామర్థ్యం, జాతీయ పట్టుదలల కలయికను చాటి చెప్పాయి. అనేక విధాలుగా, సంక్లిష్టమైన, బహుముఖ సవాళ్ల మధ్య భవిష్యత్తులో యుద్ధాలను లేదా సంఘర్షణలను భారత్ ఎలా ఎదుర్కోవాలో చెప్పేందుకు నిర్వచనంగా ఆపరేషన్ సింధూర్ నిలిచిపోతుంది. ఈ విజయం వెనుక ఉన్న ప్రధాన కారణం తడబాటు లేని రాజకీయ స్పష్టత. దశాబ్దాలుగా, శత్రువుల రెచ్చగొట్టే చర్యలకు భారత్ స్పందించే తీరు తరచుగా స్వయంగా విధించుకున్న పరిమితులకు లోబడే ఉండేది. ఆపరేషన్ సింధూర్ ద్వారా భారత్ తన సంయమనాన్ని వీడలేదు, కానీ దానిని మరింత మెరుగుపరిచింది. అవసరమైన మేరకే శక్తిని ఉపయోగిస్తూనే, ఒక ఖచ్చితమైన వ్యూహాత్మక సందేశాన్ని శత్రువుకు పంపగలమని భారత్ నిరూపించింది. అదే సమయంలో, అవసరమైతే ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేసే సామర్థ్యం కూడా ఉందని స్పష్టంగా చాటి చెప్పింది. రాజకీయ నాయకత్వం కేవలం నిర్ణయాత్మక చర్య తీసుకోవాలనే ఉద్దేశాన్ని చూపడమే కాకుండా, క్షేత్రస్థాయిలో ఉన్న సైనిక కమాండర్లకు పూర్తి కార్యాచరణ స్వేచ్ఛను ఇచ్చే అంతటి ఆత్మవిశ్వాసాన్ని ప్రదర్శించింది. లక్ష్యం పట్ల ఉన్న ఈ స్పష్టత.. వేగం, ఖచ్చితత్వం, సమన్వయంగా మారింది. ఆధునిక సైనిక పోరాటాల విజయానికి ఈ మూడు లక్షణాలే అత్యంత కీలకం. రాజకీయ సంకల్పానికి వ్యవస్థాగత సామర్థ్యం తోడైనప్పుడు అది దేశ బలాన్ని ఎన్నో రెట్లు పెంచుతుంది. ఆపరేషన్ సింధూర్ ఈ అద్భుతమైన సమన్వయానికి ఒక గొప్ప ఉదాహరణగా నిలిచింది. అంతే ప్రాముఖ్యత కలిగిన మరొక అంశం, భారతదేశం తన బహు-ముఖ సామర్థ్యాలను అత్యంత సమర్థవంతంగా అనుసంధానించడం. నేటి ఆధునిక యుద్ధం.. భూమి, నీరు, ఆకాశానికే పరిమితం కాలేదు; సైబర్, అంతరిక్షం, ఎలక్ట్రోమాగ్నెటిక్ స్పెక్ట్రమ్కు కూడా విస్తరించింది. ఈ విభిన్న రంగాల్లో తన పట్టును ప్రదర్శించడంలో దేశానికున్న ప్రావీణ్యాన్ని ఆపరేషన్ సింధూర్ నిరూపించింది. ఖచ్చితమైన దాడులతో పాటు శత్రువుల సమాచార వ్యవస్థ, సరఫరా గొలుసును దెబ్బతీసే సైబర్ ఆపరేషన్లు తోడయ్యాయి. ఎప్పటికప్పుడు నిఘా, లక్ష్యాలను గుర్తించడంలో అంతరిక్ష వనరులు కీలక పాత్ర పోషించాయి. లక్ష్యాల్ని గుర్తించడంతో పాటు దాడి తర్వాత జరిగిన నష్టాన్ని అంచనా వేయడంలోనూ క్రియాశీలకంగా పని చేశాయి. అదే సమయంలో, ఎలక్ట్రానిక్ వార్ఫేర్ సామర్థ్యాలు శత్రువుల స్పందనను బలహీనపరిచాయి. ఈ ఆపరేషన్ భారత దళాల మధ్య కేవలం సమన్వయాన్నే కాదు, సమష్టి పనితీరు, పరిణతిని ప్రతిబింబించింది. ఈ సమయంలో సివిల్-సైనిక వ్యవస్థల ఏకీకరణ పోషించిన పాత్ర ప్రత్యేకంగా గమనించాలి. ఆపరేషన్ సింధూర్ కేవలం సైనిక ప్రయత్నమే కాదు, దేశం మొత్తం కలిసి చేసిన కృషి. నిఘా సంస్థలు, సాంకేతిక సంస్థలు, పౌర నాయకత్వం, సాయుధ దళాలతో కలిసి పనిచేశాయి. నిఘా వ్యవస్థల



నుంచి ఖచ్చితమైన ఆయుధాల వరకు స్వదేశీ సాంకేతికతలు కీలక పాత్ర పోషించాయి, ఇది స్వయంసమృద్ధిపై మనం నిరంతరం పెట్టిన పెట్టుబడి ఫలితాన్ని చూపించింది. ఈ ఆపరేషన్ భారత నిర్ణయాధికార నిర్మాణంలోని సామర్థ్యాన్ని కూడా ప్రదర్శించింది, ఇక్కడ వివిధ ఏజెన్సీల మధ్య సమన్వయం, బ్యూరోక్రాటిక్ జాప్యాలకు తావు లేకుండా ఒకే లక్ష్యంతో సాగింది. ఆపరేషన్ ప్రారంభానికి ముందే భారతదేశం ఎంతో దూరదృష్టితో వ్యవహరించింది. మనం తీసుకునే చర్యలను ప్రపంచం ఏ విధంగా చూస్తుందనే విషయంలో భారత్ చాలా జాగ్రత్తగా వ్యవహరించింది. మన దౌత్యవేత్తలు ప్రపంచ దేశాలతో నిరంతరం సంప్రదింపులు జరిపి, భారత్ చేస్తున్న ఈ పోరాటం ఎవరినో ఆక్రమించుకోవడానికి కాదని, శత్రువుల రెచ్చగొట్టే చర్యలకు సమాధానంగా చేస్తున్న ‘అవసరమైన ఆత్మరక్షణ’ అని స్పష్టంగా వివరించారు. దీనివల్ల అంతర్జాతీయ సమాజం కూడా భారత్ తీసుకున్న నిర్ణయం సరైనదేనని గుర్తించింది. ఇలా సైనిక శక్తికి, రాజకీయ నేర్పు, దౌత్యనీతి తోడవ్వడం వల్లే ఆపరేషన్ సింధూర్ ఒక చారిత్రక విజయంగా నిలిచింది. దీనికి భిన్నంగా, పాకిస్థాన్ స్పందన ముందే ఊహించినట్లుగా సాగింది. సైనిక పరంగా చూస్తే, భారత్ మెరుపుదాడికి ఆ దేశం కంగుతిన్నది. తమ దగ్గర ఉన్న అరకొర వనరులు, సరిపోని యుద్ధ సామర్థ్యం వల్ల భారత్ను సమర్థంగా ఎదుర్కోవడంలో పాకిస్థాన్ విఫలమైంది. ఇక దౌత్య పరంగా, ఈ అంశాన్ని అంతర్జాతీయ వేదికలపైకి తీసుకెళ్లి ప్రపంచ దేశాల మద్దతు కూడగట్టాలని చూసినా.. అనుకున్న ఫలితం సాధించలేదు. అయితే, పాకిస్థాన్ ఎక్కువగా దృష్టి పెట్టింది మాత్రం ‘సమాచార యుద్ధం’ మీదనే. క్షేత్రస్థాయిలో జరిగిన అసలు విషయాలను దాచిపెట్టడానికి, వారు తెలివిగా అల్లిన ఎన్నో అబద్ధాలను ప్రచారం చేశారు. కానీ, వారి మాటల్లో నిజాయితీ, పొంతన లేకపోవడంతో ఆ ప్రయత్నాలు ఫలించలేదు. నేటి ఆధునిక కాలంలో సమాచారం వెనువెంటనే అందుబాటులోకి వస్తుంది కాబట్టి, పాకిస్థాన్ అల్లిన అబద్ధపు కథనాలు ప్రపంచం ముందు త్వరగానే బట్టబయలయ్యాయి. ఈ తప్పుడు ప్రచారాన్ని ఎంతో స్పష్టతతో, ఆత్మవిశ్వాసంతో తిప్పికొట్టడం చాలా ముఖ్యం. ఆపరేషన్ సింధూర్ అనేది భారతదేశం కావాలని చేసిన దురాక్రమణ కాదు.. శత్రువుల ప్రత్యక్ష రెచ్చగొట్టే చర్యలకు భారత్ ఇచ్చిన సరైన సమాధానం. ఈ ఆపరేషన్ లక్ష్యాలు చాలా స్పష్టమైనవి, ఎంచుకున్న స్థావరాలు చట్టబద్ధమైనవి, దీనిని అత్యంత క్రమశిక్షణతో నిర్వహించారు. భారతదేశం ఎప్పుడూ హద్దులు దాటలేదు; అవసరమైన మేరకు మాత్రమే స్పందిస్తూ, అత్యంత సంయమనంతో వ్యవహరించింది. ఆపరేషన్ జరిగినంత కాలం భారత్ నిజమైన సమాచారాన్ని మాత్రమే వెల్లడించింది. ఎంతో పారదర్శకతను పాటిస్తూ, విశ్వసనీయమైన మార్గాల ద్వారా అసలు విషయాలను ప్రపంచానికి తెలియజేయడం వల్ల, వాస్తవాలను వక్రీకరించే శత్రువుల ప్రయత్నాలు పూర్తిగా విఫలమయ్యాయి. ఆపరేషన్ సింధూర్ భవిష్యత్తుకు మార్గనిర్దేశం చేసే కొన్ని విలువైన పాఠాలను నేర్పింది. మొదటిది, రాజకీయ సంకల్పం అత్యంత కీలకం. మనం ఏ విషయంలోనైనా అస్పష్టంగా ఉంటే అది శత్రువులకు బలాన్నిస్తుంది, అదే స్పష్టమైన వైఖరితో ఉంటే వారు భయపడతారు. రెండోది, యుద్ధతంత్రంలో కేవలం సైన్యమే కాదు, సైబర్, అంతరిక్షం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి ఆధునిక రంగాల్లో కూడా మనం పట్టు సాధించాలి. భవిష్యత్తులో మన ఆధిక్యాన్ని నిలబెట్టుకోవడానికి ఈ రంగాల్లో పెట్టుబడులు చాలా అవసరం. మూడవది, దేశంలోని పౌర, సైనిక వ్యవస్థలు మరింతగా కలిసి పనిచేయాలి. జాతీయ శక్తిని ఒక పద్ధతి ప్రకారం సమన్వయం చేసుకున్నప్పుడే మనం ఏ సవాలునైనా సమర్థంగా ఎదుర్కోగలం. మరొక ముఖ్యమైన పాఠం సమాచార యుద్ధతంత్ర రంగంలో ఉంది. ప్రజల ఆలోచనలను, అభిప్రాయాలను ప్రభావితం చేసే ఈ పోరాటం నిరంతరంగా, ఎటువంటి సరిహద్దులు లేకుండా సాగుతూనే ఉంటుంది. తప్పుడు సమాచారాన్ని గుర్తించడానికి, దానిని తిప్పికొట్టడానికి, అది వ్యాప్తి చెందక ముందే అడ్డుకోవడానికి భారతదేశం తన సామర్థ్యాలను మరింత బలోపేతం చేసుకోవాలి. దీనికోసం కేవలం అత్యాధునిక సాంకేతిక పరికరాలు ఉంటే సరిపోదు; వేగవంతమైన, నమ్మదగ్గ సమాచారాన్ని ప్రజలకు చేరవేసే బలమైన వ్యవస్థలు కూడా ఉండాలి. యుద్ధ క్షేత్రంలో విజయం సాధించడమే కాదు, ప్రపంచం ముందు సరైన వాస్తవాలను నిలబెట్టి మన వాదనను గెలిపించుకోవడమనేది వ్యూహాత్మక విజయానికి అత్యంత కీలకం. ఆపరేషన్ సింధూర్ రక్షణ రంగంలో స్వయంసమృద్ధి ప్రాముఖ్యతను మరోసారి గుర్తుచేసింది. మన దేశంలోనే తయారైన యుద్ధ వ్యవస్థలు తమ సత్తాను నిరూపించుకున్నాయి. దీనివల్ల ఇతర దేశాలపై ఆధారపడటం తగ్గడమే కాకుండా, మన నిర్ణయాలు మనమే తీసుకునే స్వేచ్ఛ పెరిగింది. పరిశోధన, అభివృద్ధి, సరికొత్త ఆవిష్కరణలలో నిరంతరం పెట్టుబడులు పెట్టడం ద్వారానే ఈ వేగాన్ని మనం కొనసాగించగలం. ఈ లక్ష్యాన్ని సాధించడంలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలు కలిసికట్టుగా పనిచేయడం అత్యంత కీలకం. ఇలాంటి సమన్వయం ఉన్నప్పుడే రక్షణ రంగంలో భారత్ మరింత శక్తివంతంగా మారుతుంది. చివరగా, అస్థిరమైన భద్రతా వాతావరణంలో మనం ఎల్లప్పుడూ సన్నద్ధంగా ఉండాలనే అవసరాన్ని ఈ ఆపరేషన్ గుర్తు చేస్తుంది. శత్రువును నియంత్రించడమనేది ఒకేచోట ఆగిపోయే అంశం కాదు; మనకు ఉన్న శక్తి సామర్థ్యాలను, దృఢ నిశ్చయాన్ని నిరంతరం నిరూపించుకుంటూనే దానిని బలోపేతం చేయాలి. ఆపరేషన్ సింధూర్ ఒక కొత్త ప్రమాణాన్ని నెలకొల్పింది. అయితే, ఈ స్థాయిని భవిష్యత్తులోనూ కొనసాగించాలంటే నిరంతర కృషి అవసరం. దీనికోసం సైనిక శిక్షణను మెరుగుపరచడం, యుద్ధ తంత్రాలను ఆధునీకరించడం, మారుతున్న కాలానికి అనుగుణంగా మన రక్షణ సిద్ధాంతాలను ఎప్పటికప్పుడు మార్చుకుంటూ ముందుకు సాగాలి. భారతదేశం ‘ఆపరేషన్ సింధూర్’ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న వేళ, ఈ ఆపరేషన్ అందించిన సందేశం చాలా స్పష్టంగా ఉంది. ఇది కేవలం ఒక సైనిక చర్య మాత్రమే కాదు, ఒక బలమైన వ్యూహాత్మక ప్రకటన. తన ప్రయోజనాలను కాపాడుకోవడానికి అవసరమైన సామర్థ్యం, ఆ పనిని నిర్ణయాత్మకంగా పూర్తి చేయగల సంకల్పం.. రెండూ భారతదేశానికి ఉన్నాయని ప్రపంచానికి చాటి చెప్పింది. ‘నియంత్రణ’ పాటించడం అనేది ఒక ఎంపిక మాత్రమే తప్ప, అది బలహీనత వల్ల వచ్చిన తప్పనిసరి పరిస్థితి కాదని ఈ ఆపరేషన్ ద్వారా నిరూపితమైంది. అంటే, భారత్ శాంతిని కోరుకుంటున్నప్పటికీ, అవసరమైతే కఠినంగా స్పందించడానికి వెనుకాడదని స్పష్టమైంది. రాబోయే కాలంలో, ‘ఆపరేషన్ సింధూర్’ ఒక అత్యుత్తమ ఉదాహరణగా నిలిచిపోతుంది. బలమైన రాజకీయ నాయకత్వం, జాతీయ సమైక్యత అండగా ఉంటే, మల్టీ-డొమైన్ ఆపరేషన్లను ఎంత సమర్థవంతంగా నిర్వహించవచ్చో ప్రపంచానికి తెలియజేసే పాఠమిది. ఈ ఆపరేషన్ భారత్ పట్ల దేశీయంగా, అంతర్జాతీయంగా ఉన్న అంచనాలను పూర్తిగా మార్చివేసింది. అన్నిటికంటే ముఖ్యంగా, ఇది ఒక శక్తివంతమైన సూత్రాన్ని మరోసారి స్థిరపరిచింది: జాతీయ సంకల్పం, సామర్థ్యం కలిసి పనిచేసినప్పుడు, ఫలితాలెప్పుడూ తిరుగులేని విధంగానే ఉంటాయి. ఆపరేషన్ సింధూర్ వారసత్వం కేవలం ఆ సమయంలో దక్కిన విజయానికే పరిమితం కాలేదు. అది మనలో నింపిన ఆత్మవిశ్వాసంలో, మన వ్యవస్థలు అంతర్గతంగా నేర్చుకున్న పాఠాలలో, భారతదేశ వ్యూహాత్మక భవిష్యత్తు కోసం అది నిర్దేశించిన దిశలో ఆ వారసత్వం దాగి ఉంది. భవిష్యత్తులో కూడా ఇంకా పరిష్కారం కాని వివాదాలు వివిధ రంగాల్లో, కొత్త రూపాల్లో దేశాన్ని పరీక్షిస్తూనే ఉంటాయి. అయినప్పటికీ, దేశంలోని రాజకీయ, సైనిక, వ్యవస్థాగత యంత్రాంగాలు అన్నీ ఒకే తాటిపై ఉండి, పూర్తి స్పష్టతతో, ఒకే లక్ష్యంతో తమ శక్తినంతా సమన్వయం చేసుకున్నంత కాలం, ఆ ప్రభావం సమతుల్యత ఖచ్చితంగా భారత్ కు అనుకూలంగానే ఉంటుంది. అంటే, మన దేశంలోని అన్ని విభాగాలు కలిసికట్టుగా పనిచేసినంత కాలం, ఎదురయ్యే సవాళ్లపై భారత్ పైచేయి సాధిస్తూనే ఉంటుంది.

Lt Gen Syed Ata Hasnain (Retd)
రచయిత : **లెఫ్టినెంట్ జనరల్ సయ్యద్ అతా హస్నైన్** (రిటైర్డ్).
(బీహార్ రాష్ట్ర గవర్నర్, భారతదేశపు శ్రీనగర్ కేంద్రంగా పనిచేసే చినార్ కార్ప్స్ మాజీ కమాండర్)
(The writer is Governor, State of Bihar and former Commander of Indiaµs Srinagar based Chinar Corps)

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI No: APTEL/2015/66622, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan